ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 22 డిసెంబరు 2024



కుంభమేళాకు ప్రత్యేక రైలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జనవరిలో జరగనున్న కుంభమేళాకు గుంటూరు నుంచి ప్రత్యేక రైలుని ఏర్పాటు చేసినట్లు డీఆర్ఎం రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 07701 గుంటూరు - అజాంగడ్ రైలు జనవరి 24(శుక్రవారం) రాత్రి 11 గంటలకు గుంటూరులో బయల్దేరి 26న ఉదయం 6.20కి ప్రయాగ్‌రాజ్, మధ్యాహ్నం 12 గంటలకు బనారస్(వారణాసి), సాయంత్రం 5.15 గంటలకు అజాంగడ్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో నంబరు. 07702 అజాంగడ్ - గుంటూరు రైలు జనవరి 26(ఆదివారం) రాత్రి 7.45కి బయలుదేరి 11.20కి బనాసర్, 27న వేకువజామున 4 గంటలకు ప్రయాగ్‌రాజ్, 28న ఉదయం 9 గంటలకు గుంటూరు చేరుకుంటుంది.



బహిరంగ.. సిట్టింగ్‌లు

- ఖాళీ స్థలాలూ మద్యపాన కేంద్రాలు
- గంజాయి గుంపులతో భయానక పరిస్థితి
- మహిళలు, విద్యార్థినుల్లో భయాందోళనలు
- రోడ్లు, కూడళ్లలో మందుబాబుల హల్‌చల్

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్లు, ఖాళీ స్థలాలు, పార్కులు, గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో పగలు, రాత్రి అన్న తేడా లేకుండా మందుబాబుల సిట్టింగ్‌లతో సందడిగా మారుతున్నాయి. ఆ పరిసరాల వైపు పురుషులు కూడా వెళ్లేందుకు భయపడుతుంటారంటే మందుబాబుల హల్‌చల్ ఏ స్థాయిలో ఉంటుందో తెలుసుకోవచ్చు. గత వైసీపీ ప్రభుత్వంలో విడతల వారీ మద్యపాన నిషేధం పేరుతో తీసుకువచ్చిన మద్యం పాలసీతో గతంలో రహస్యంగా సాగిన మద్యపానం రోడ్డెక్కింది. అప్పటి ప్రభుత్వంలో ప్రారంభమైన బహిరంగ మద్యపాన అరాచకం కూటమి ప్రభుత్వంలోనూ కొనసాగుతోంది. ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పర్మిట్ రూములను వైసీపీ ప్రభుత్వం రద్దు చేయడంతో మొదలైన బహిరంగ మద్యపానం నేడు అతి పెద్ద సామాజిక సమస్యగా రూపుదాల్చింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తీసుకువచ్చిన నూతన మద్యం పాలసీ ఈ ప్రమాదాన్ని అరికడుతుందని అంతా భావించారు కానీ.. నేటికీ ఈ సామాజిక జాడ్యం ప్రజలను వెంటాడుతోంది. 2019కి ముందు వరకూ మద్యం దుకాణాలు ప్రైవేటు యాజమాన్యాల కింద ఉండేవి. అప్పట్లో మందుబాబులకు షాపు నిర్వాహకులే పర్మిట్ రూములను ఏర్పాటు చేసేవారు. ఆ కారణంగా వారంతా ఆ షాపులోనే మద్యం తాగి ఇళ్లకు వెళ్లేవారు. కానీ వైసీపీ ప్రభుత్వం ప్రైవేటు వైన్స్‌ను రద్దు చేసి ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటు చేసింది. దీంతో అప్పటి వరకూ నాలుగు గోడల మధ్య ఉండే మద్యపాన వ్యవహారం వీధుల్లోకి వచ్చిపడింది. కూటమి ప్రభుత్వం తిరిగి పాత విధానాన్ని ప్రవేశపెట్టినా బహిరంగ మద్యపానాలు మాత్రం గతంలో మాదిరిగానే కొనసాగుతున్నాయి. ఎక్కడంటే అక్కడ మద్యం అందుబాటులోకి రావడంతో మందుబాబులు ఎక్కడికక్కడే సిట్టింగ్ వేస్తున్నారు. దర్జాగా రోడ్ల సమీపంలోనే బైఠాయించి నిస్సంకోచంగా మద్యం తాగుతున్నారు. పట్టణాల్లోని దుకాణాలు, చిల్లరకొట్లు, షాపుల ముందుండే అరుగులు, ఫుట్‌పాత్‌లు, ఇళ్ల మధ్యలో ఉండే ఖాళీ స్థలాలు, రోడ్డు మార్జిన్లు, రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారాలు, బస్ షెల్టర్లు, కల్వర్టులు, పబ్లిక్ పార్కులు, పాఠశాల ప్రాంగణాలు, గ్రామాల్లో ఉండే ముఖ్యమైన కూడళ్లను ఆక్రమించివేస్తున్నారు. నలుగురు కలిసి అక్కడే కూర్చుని మద్యం తాగుతున్నారు. మందుబాబులు గుంపులు, గుంపులుగా పోగుపడే విధానం వచ్చిన తర్వాత దాన్ని ఆసరా చేసుకుని గంజాయి గుంపు కూడా వీధుల్లోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో గంజాయి విచ్చలవిడి చలామణి కారణంగా ముక్కుపచ్చలారని చిన్నారులు సహా అనేక మంది యువకులు గంజాయి మహమ్మారికి అలవాటు పడ్డారు. వారంతా మందుబాబులను ఆసరా చేసుకుని బహిరంగ ప్రదేశాల్లోనే గంజాయి తీసుకునేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక స్వయంగా స్థానిక ఎమ్మెల్యేలకే ప్రజలు గంజాయి, మందుబాబుల గుంపుల బైఠాయింపు, దాడులపై ఫిర్యాదులు చేసిన సందర్భాలు అనేకం జిల్లాలో ఉన్నాయి. బహిరంగంగా గంజాయి, మద్యపానం కారణంగా ఉనికిలోకి వచ్చిన అరాచక గుంపులు సమాజానికి పెనుసవాలుగా మారుతున్నాయి. మహిళలు, విద్యార్థులు, యువతులు బయటికి రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. మహిళలపై అఘాయిత్యాలు నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో అత్యవసరమైన పనులున్నా కూడా బయటికి రావడానికి జంకుతున్నారు. గడిచిన ఐదేళ్లలో మహిళలపై దాడులు, దౌర్జన్యాలు విపరీతంగా పెరిగాయి. అత్యాచారాలు, హత్యలు, సామూహిక దాడులు మహిళలపై లెక్కకు మించి పెరిగాయి. ఎక్కడో దూరంగా జరిగే ఘటనలు జిల్లాలో రోజువారీ ఘటనలుగా మారిపోయి భయానక వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితిని చక్కదిద్ది, మహిళా భద్రతకు భరోసా కల్పించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వంపై ఎంతైనా ఉంది. కూటమి ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన తాజా మద్యం పాలసీ మహిళలకు నిరాశనే మిగిల్చింది. పర్మిట్ రూము విధానం అమలు చేయకపోవడంతో బహిరంగ మద్యపానం నేటికీ రాజ్యమేలుతోంది. కూటమి ప్రభుత్వం వచ్చాక మందుబాబుల వీధి విహారం యథేచ్ఛగా సాగుతోంది.



పీసీ చైర్మన్లుగా.. పులుకూరి పంతాని

- సాగర్, కేడబ్ల్యూడీల ఎన్నిక ఏకగ్రీవం
- వైఎస్ చైర్మన్లుగా చక్రపాణి, సునీల్‌చౌదరి
- ముగిసిన సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ
- పల్నాడు, బాపట్ల జిల్లాలకు సాగర్ పీసీ పదవుల పంపకం
- బాపట్ల, గుంటూరు జిల్లావాసులకు కేడబ్ల్యూడీ పీసీ పదవులు
- ఆయకట్టు రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అడుగులు వేస్తామన్న నేతలు



నాగార్జున సాగర్ పీసీ చైర్మన్‌గా ఎన్నికైన పులుకూరి కాంతారావు, వైస్ చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణికి డిక్లరేషన్ పత్రాలను అందజేస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఎమ్మెల్యే యరపతినేని, ఎస్పీ పీ కృష్ణమోహన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావును అభినందిస్తున్న మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యేలు ఆనందబాబు, రామాంజనేయులు.

సాగునీటి రంగాన్ని అస్తవ్యస్తం చేశారు.. సంఘాలను విస్మరించారు.. కాల్వల మరమ్మతులు మరిచారు.. అన్నదాతల గోడు అరణ్య రోదనగా మార్చారు.. మొత్తం మీద వైసీపీ ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగం సంక్షోభంలో చిక్కుకుంది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జలవనరులకు జవసత్వాలు తీసుకు వచ్చేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. తొలుత సాగునీటి ఎన్నికలు నిర్వహించింది. ఈ క్రమంలో ఈ నెల 14 నుంచి ప్రభుత్వం సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియకు శ్రీకారం చుట్టగా శనివారం పీసీ చైర్మన్ల ఎంపికతో ఆ క్రతువు ముగిసింది. బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల పరిధిలోని నాగార్జున సాగర్ కుడి కాల్వ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ ఎన్నిక జరగ్గా చైర్మన్‌గా పులుకూరి కాంతారావు, వైఎస్ చైర్మన్‌గా ఉప్పలపాటి చక్రపాణిలను ఎన్నుకున్నారు. అమృతలూరు మండలం కూచిపూడిలోని కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన ఎన్నికలో చైర్మన్‌గా పంతాని మురళీధరరావు, వైస్ చైర్మన్‌గా నువ్వుల సునీల్‌చౌదరిలను ఎన్నుకున్నారు. టీసీలు, డబ్ల్యూయూఏ, డీసీల పదవులలో అధ్యక్షులు ఇప్పటికే కొలువుతీరగా పీసీ చైర్మన్ల ఎన్నిక కూడా ముగియడంతో ఇక సాగునీటి రంగాన్ని గాడిలో పెట్టడానికి పదవుల్లో కొలువుదీరిన వారు కృషి చేసే దిశగా ప్రభుత్వం మార్గనిర్దేశనం చేయనుంది.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా పల్నాడు జిల్లా గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు(కారంపూడి డీసీ అధ్యక్షుడు)ను, బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి చెందిన ఉప్పలపాటి చక్రపాణి(కొనంకి డీసీ అధ్యక్షుడు)ని డిస్ట్రిబ్యూటరీ కమిటీల అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంతారావు, చక్రపాణిలకు కలెక్టర్ అరుణ్‌బాబు డిక్లరేషన్ పత్రాలను అందజేశారు. వీరిని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, జలవనరులశాఖ ఎస్సీ కృష్ణమోహన్ అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మురళి, ఇరిగేషన్ ఈఈ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల పరిధిలోని డీసీల అధ్యక్షులు ఎన్నికకు హాజరయ్యారు. పీసీ చైర్మన్‌గా కాంతారావుకు రెండేళ్లు, తదుపరి మూడేళ్లు గోగినేని కోటేశ్వరరావు పేర్లను టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.

కాల్వ బాగుకు కృషి చేస్తాం : చైర్మన్, వైస్‌చైర్మన్లు

వైసీపీ ఐదేళ్ల పాలనలో పాడుబెట్టడంతో అధ్వానస్థితికి చేరిన సాగర్ కాల్వల బాగుకు తాము కృషి చేస్తామని చైర్మన్ పులుకూరి కాంతారావు, వైస్‌చైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి తెలిపారు. సాగునీటి కాల్వల్లో గడ్డిపరక కూడా తొలగించలేదని కాంతారావు తెలిపారు. కుడి కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కాల్వల పరిధిలోని సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామన్నారు. కాల్వలను

(మిగతా 8వ పేజీలో)

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్

అమృతలూరు, బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా రేపల్లె నియోజకవర్గ పరిధిలోని మోర్తోట డీసీ అధ్యక్షుడైన పంతాని మురళీధరరావును ఎన్నుకున్నారు. వైస్ చైర్మన్‌గా చేబ్రోలు డీసీ అధ్యక్షుడైన కాకుమాను మండలానికి చెందిన నువ్వుల సునీల్‌చౌదరిని ఎన్నుకున్నారు. ప్రాజెక్టు పరిధిలోని 22 మంది డీసీలు హాజరు కాగా చైర్మన్ పదవికి మురళీధరరావు పేరును మొఖమాటం రాధాకృష్ణమూర్తి, వైస్ చైర్మన్ పదవికి సునీల్‌చౌదరి పేరును దడ్డుకూటి బూషబాబు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదించారు. వెలుగొండ ప్రాజెక్టు ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి చైర్మన్, వైఎస్ చైర్మన్లకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఎస్ఈ వెంకటరత్నం, చీరాల డీఈ ఎన్‌కేవీ ప్రసాద్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భ్రష్టుపట్టించారు : మంత్రి పార్థసారథి

గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి రంగాన్ని భ్రష్టుపట్టించిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ఎన్నిక అనంతరం మంత్రి, వేమూరు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు చైర్మన్, వైఎస్‌చైర్మన్లను అభినందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం సాగు నీటి రంగాన్ని నిర్లక్ష్యం చేసి రైతులకు తీరని అన్యాయం చేసిందన్నారు. సాగు నీటి రంగం కోసం చంద్రబాబు రూ.వేల కోట్లు ఖర్చు చేసి ప్రాజెక్టుల నిర్మాణం చేపడితే వాటిని నాశనం చేసేదాకా జగన్ నిద్రపోలేదన్నారు. గత ప్రభుత్వం చేతకానితనం వల్ల సాగు నీటి రంగం

(మిగతా 8వ పేజీలో)

8 ఇద్దరు రైల్వే అధికారులకు జాతీయ అవార్డులు


వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణ

6 గోవా నుంచి గుంటూరుకు అక్రమ మద్యం రవాణా

- పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు

గాలులు.. చినుకులు

- అన్నదాతల్లో ఆందోళన మొదలు
- హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచిక



నిజాంపట్నం హార్బర్‌లో 3వనెంబర్ ప్రమాద సూచిక ఎగురవేత

రేపల్లె, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫాన్‌గా మారడంతో తీరంలో శనివారం ఉదయం నుంచి ఈదురు గాలులతో కూడిన చిరుజల్లులు పడ్డాయి. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. నాలుగు రోజులుగా వాతావరణంలో మార్పు రావడంతో రైతులు హార్వెస్టుల ద్వారా కోతలు కోసి ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఈ పరిస్థితుల్లో చిరుజల్లుపడటంతో రైతులు ధాన్యం తడిసిపోతాయని ఆందోళన చెందుతున్నారు. ఆరబెట్టుకున్న ధాన్యం రాశులపై పట్టాలు కప్పుకుని జాగ్రత్త పడుతున్నారు. వర్షం పెద్దదైతే ధాన్యం అంతా నీటిపాలవుతుందంటూ రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా రెండు రోజులుగా కోసిన పనలు ఎండకుండానే కుప్పలు వేసుకుంటున్నారు.

తుఫాన్‌గా మారిన అల్పపీడనం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తుఫాన్‌గా మారింది. శనివారం నిజాంపట్నం హార్బర్‌లో మూడో నెంబరు ప్రమాద సూచిక ఎగరవేశారు. మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లరాదని, వెళ్లిన వారంతా తీరానికి చేరుకోవాలని అధికారులు ఆదేశించారు. ఇప్పటికే 90 శాతం వేటకు వెళ్లిన బోట్లు హార్బర్‌కు చేరుకున్నాయి. తుఫాన్ ప్రభావంతో సముద్రంలో అలల తీవ్రత ఎక్కువగా ఉంటుందని చిన్నబోట్లు వారు వేటకు వెళ్లరాదని అధికారులు ఆదేశాలు జారీ చేశారు.



జాతీయ రహదారిపై ఆరబెట్టుకున్న వరి ధాన్యం

రైతులను మోసగిస్తే మిల్లర్లపై చర్యలు

- అవకతవకలకు పాల్పడితే లైసెన్స్‌ల రద్దు
- అసోసియేషన్ నాయకుల సమావేశంలో కలెక్టర్ హెచ్చరిక



కలెక్టర్ జె.వెంకటమురళి

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులను మోసగిస్తే చర్యలు తీసుకుంటాం.. ధాన్యం కొనుగోళ్లలో అవకతవకలకు పాల్పడితే లైసెన్సులు రద్దు చేస్తాం.. అని మిల్లర్లకు కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. శనివారం కలెక్టర్ తన చాంబర్‌లో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు హెచ్చరికలు జారీ చేశారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తుంటే మిల్లర్ల తీరు అందుకు భిన్నంగా ఉందన్నారు. ఆంక్షలతో రైతులను నష్టపర్చాలని చూస్తే సహించేదిలేదన్నారు. ప్రభుత్వ విధానాలపై పూర్తి స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వ్యవసాయాధికారులపై ఉందన్నారు. తేమశాతం అధికంగా ఉందని సాకు చూపి క్వింటాకు అదనంగా 10 కేజీల చొప్పున ధాన్యాన్ని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నట్లు తెలిసిందన్నారు. తేమశాతంలో తేడాలు ఉంటే సంబంధితాధికారులకు తెలియజేయాలన్నారు. గోనె సంచుల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, పౌరసరఫరాల జిల్లా అధికారి విలియమ్స్, జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్యామ్‌సన్, జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాస్, బాపట్ల తాలూకా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరామప్రసాద్, జీడీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం తదితరులు పాల్గొన్నారు.

అర్జీలపై అధికారులదే బాధ్యత

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదయ్యే అర్జీల పరిష్కారంలో నాణ్యత లేకపోతే అధికారులే బాధ్యులవుతారని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. తహసీల్దార్లు, జిల్లా అధికారులతో కలెక్టర్ శనివారం కాన్ఫరెన్స్ నిర్వహించి పునరావృతమయ్యే అర్జీలను గుర్తించి సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు. పౌరులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండానే వారి అర్జీలు పరిష్కరించినట్లు కొందరు అధికారులు క్లోజ్ చేయడం సరికాదన్నారు. ఇందుకోసం కలెక్టరేట్‌లో ప్రత్యేకసెల్ ఏర్పాటు చేస్తామన్నారు.పర్చూరు మండల ఇంజనీరింగ్ అసిస్టెంట్ పరిధిలో 88 ఫిర్యాదులకు పరిష్కారం చూపినా అసంతృప్తి వ్యక్తం చేయడంపై కలెక్టర్ ఆరా తీశారు. చీరాల మండలంలోని అదే పరిస్థితి ఉండటంపై అధికారులను నిలదీశారు.

వర్గీకరణపై వినతిపత్రాల స్వీకరణ

రాష్ట్రంలో షెడ్యూల్ కులాల వర్గీకరణను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించేందుకు విశ్రాంత ఐఏఎస్ రాజీవ్‌రంజన్‌మిశ్రా ఆధ్వర్యంలో నియమించిన ఏకసభ్య కమిషన్‌కు వినతిపత్రాలను అందజేయవచ్చని కలెక్టర్ వెంకటమురళి తెలిపారు. వర్గీకరణపై కమిషనర్‌కు నివేదించే వ్యక్తులు, సంస్థలు వినతిపత్రాలను పై రెండు అంశాలకు సంబంధించిన వాస్తవాలను తగు ధ్రువీకరణపత్రాలతో సమర్పించాలన్నారు. ఒరిజనల్ ధ్రువీకరణపత్రాలను జనవరి 9లోగా ఉదయం 10 గంటలు నుంచి సాయంత్రం 5గంటలలోపు విజయవాడలోని కార్యాలయంలో సమర్పించి రశీదు పొందాలన్నారు. లేదా రిజిస్టర్ పోస్ట్ ద్వారా కూడా పంపవచ్చన్నారు.

యువతకు ఉపాధి అవకాశాల్లో చేయూత

● ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, గౌతు శిరీష

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రస్తుత విద్యార్థులకు చేయూత అందిస్తామని, తమ ఆధ్వర్యంలో ఉన్న కంపెనీల్లో ఇంటర్న్‌షిప్‌కు అవకాశాలు కల్పిస్తామని ఆర్‌వీఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాల పూర్వ విద్యార్థులైన ఎమ్మెల్యేలు గౌతు శిరీష, వెనిగండ్ల రాము హామీ ఇచ్చారు. చౌడవరంలోని కళాశాలలో శనివారం సందడి వాతావరణంలో 1995-99 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము (గుడివాడ), గౌతు శిరీష(పలాస) మాట్లాడుతూ విద్యార్థి దశలో గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరువేసుకునే ఈ ఆత్మీయ సమ్మేళనం, జీవితంలో మరువలేని ఒక అద్భుత ఘట్టం అన్నారు. ఉజ్వల భవిష్యత్తును అందించిన కళాశాలను మరువ కూడదని, రాష్ట్రంలోనే కాకుండా, దేశంలో కళాశాల అగ్రస్థానంలో ఉండటం తమకు గర్వకారణం అన్నారు. కార్యక్రమంలో యార్లగడ్డ వెంకన్న చౌదరి, కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్, ఆర్‌అండ్‌డి డాక్టర్ కె.రవీంద్ర, కళాశాల డైరెక్టర్ ఫైనాన్స్ అండ్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ ఎన్వీ ఎస్.వి. శ్రీనివాసరావు, కళాశాల పూర్వ విద్యార్థుల విభాగం కన్వీనర్ డాక్టర్ స్వర్ణశ్రీ, అధ్యక్షులు రత్న ప్రసాద్, కళాశాల వివిధ శాఖల విభాగాధిపతులు, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

పురుషుల ఖోఖో పోటీలు ప్రారంభం


పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్‌డీవో రామకృష్ణ

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పరిధిలో ఖోఖో పురుషుల అంతర కళాశాల పోటీలు శనివారం ప్రారంభం అయ్యాయి. తొలిరోజు పోటీలను శాప్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, డీఎస్‌డీవో పి.నరసింహారెడ్డి తదితరులు ప్రారంభించారు. మొదటి రోజు పోటీల్లో విక్టరి డిగ్రీ కళాశాల, డీసీఆర్‌ఎం, డిగ్రీ కళాశాల ఇంకొల్లు, వాగ్దేవి డిగ్రీ కళాశాల, కృష్ణవేణి డిగ్రీ కళాశాలల వారు లీగ్‌లలో ప్రవేశించినట్లు యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పీపీ సత్యపాల్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాలల కార్యదర్శి కేవీ బ్రహ్మం, వాసవి విద్యానిధి కమిటీ అధ్యక్షుడు పొట్టి సుబ్రహ్మణ్యం, కళాశాల వ్యాయామ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీ: రిక్షా కార్మికుడు మృతి

పిట్టలవానిపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని రిక్షా కార్మికుడు మృతి చెందాడు. చందోలు ఎస్సై ఆర్.స్వామి శ్రీనివాస్ కథనం ప్రకారం కర్లపాలెం మండలం దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన కుంచల శివారెడ్డి(53) పిట్టలవానిపాలెం మండలం ఖాజీపాలెం గ్రామంలో రిక్షాబండి తోలుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బాపట్ల ఏరియావైద్యశాలకు తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. కుంచల చిన సుబ్బారెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముఖ్యమంత్రి కార్యాలయ ఫిర్యాదులపై నిర్లక్ష్యం

● వారాల తరబడి పట్టించుకోని పోలీసులు
● సీఎం ఆదేశించినా స్పందించని వైనంపై బాధితుల్లో ఆందోళన
● ఎట్టకేలకు సీఎంఓ ఫిర్యాదులపై దృష్టి సారించిన ఎస్పీ
● ఆయా ఫిర్యాదులపై చర్యలు తీసుకోవాలంటూ ఎస్‌హెచ్‌ఓలకు హెచ్చరికలు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీసు అధికారుల నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తుండడం పట్ల తీవ్ర విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రే ఆయా ఫిర్యాదులపై త్వరితగతిన విచారణ జరిపి ఫిర్యాదులోని అంశాలు వాస్తవమైతే చట్ట ప్రకారం తగు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. గడచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ హయాంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీస్ అధికారులు కుమ్మక్కై పెద్ద ఎత్తున భూ కబ్జాలకు, తప్పుడు కేసులకు, అక్రమాలకు పాల్పడ్డారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలపై వచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకుండా అడ్డుపడ్డారు. ఫలితంగా ఎంతోమంది బాధితులు అన్యాయానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వినూత్నంగా బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించడంతో నాటి వైసీపీ అక్రమాలు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇతర మంత్రులు, పార్టీ నాయకులు తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఫిర్యాదు స్వీకరిస్తుండగా, మంత్రి నారా లోకేశ్ తన క్యాంపు కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. స్వీకరించిన ఫిర్యాదులను వారు సంబంధిత జిల్లాల కలెక్టర్లకు, ఎస్పీలకు పంపుతూ తక్షణం విచారించి చర్యలు తీసుకోవాల్సిందిగా ముఖ్యమంత్రి కార్యాలయ అధికారులు, అదేవిధంగా మంత్రి లోకేశ్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రతిరోజు ఆయా కార్యాలయాల్లో బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకుంటుండగా రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో బాధితులు ఆయా కార్యాలయాలకు క్యూ కడుతున్నారు. దీనిలో భాగంగా ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి కూడా పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. తాము నేరుగా ముఖ్యమంత్రి చంద్రబాబును, మంత్రి లోకేశ్‌ను, వారు అందుబాటులో లేని సమయంలో ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి ఫిర్యాదు చేశామని తమకు న్యాయం జరుగుతుందని బాధితులు ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే బాధితుల ఎదురుచూపులు రోజులు వారాలు దాటి నెలలు గడుస్తున్నా సంబంధిత పోలీస్ స్టేషన్ నుంచి బాధితులకు ఎటువంటి సమాచారం రాకపోతుండటంతో వారు ఆందోళన చెందుతున్నారు. మరికొందరైతే తమ ఫిర్యాదులపై స్పందించలేదంటూ తిరిగి ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్తున్నారు. ఈ విధంగా సీఎంఓ నుంచి, అదే విధంగా మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత కార్యాలయాల నుంచి పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు జిల్లాలకు అందుతున్నప్పటికీ ఆశించిన స్థాయిలో బాధితులకు న్యాయం జరగడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అంతే కాకుండా కొందరు అధికారులు ఆయా ఫిర్యాదులపై మొక్కుబడిగా స్పందిస్తూ ఉన్నతాధికారులకు సమస్య పరిష్కారమైనట్లుగా ఏదో సమాధానం పంపుతున్నారు. సివిల్ వివాదమనో, గతంలోనే చర్యలు తీసుకున్నామనో తిరుగు సమాధానం పంపి చేతులు దులుపుకుంటున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే సీఎంవో, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల పేషీల నుంచి వచ్చే ఫిర్యాదులపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరగడం లేదనే ఆరోపణలు కూడా ఉన్నాయి. దీంతో అనేక మంది బాధితులు తిరిగి సోమవారం పోలీస్ కార్యాలయంలో జరిగే ఎస్పీ గ్రీవెన్స్‌కు హాజరై తాము సీఎంఓ, మంత్రి లోకేశ్, హోం మంత్రి అనిత తదితరుల కార్యాలయాల్లో ఫిర్యాదు చేశామని అయినప్పటికీ న్యాయం జరగలేదని వాపోతూ ఫిర్యాదులు చేస్తున్నారు. కొన్ని స్టేషన్‌లలో అయితే ఆయా ఫిర్యాదులను కనీసం చదవకుండానే పక్కన పడేస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఆయా ఫిర్యాదులకు కనీస ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఆయా కార్యాలయాలకు వచ్చే ప్రతి ఫిర్యాదును వారు తమ రిజిస్టర్లో నోట్ చేసుకొని దానికి ఒక నెంబర్ కేటాయించి సంబంధిత జిల్లాలకు పంపిస్తున్నారు. వాటిపై తీసుకున్న చర్యలకు సంబంధించి (యాక్షన్ టేకెన్ రిపోర్ట్) సమాధానం పంపాలంటూ కోరుతున్నారు. అత్యధికంగా జిల్లా కలెక్టర్లకు, అదేవిధంగా కొన్ని జిల్లా ఎస్పీ కార్యాలయాలకు ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని అధికారులు సంబంధిత పోలీస్ స్టేషన్లకు పంపుతున్నారు. అయితే ఆ విధంగా పోలీస్‌స్టేషన్లకు వెళ్లిన ఫిర్యాదుల్లో అనేకం కనీసం విచారణకు కూడా నోచుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

సీఎంఓ ఫిర్యాదులపై నిర్లక్ష్యం పట్ల ఎస్పీ ఆగ్రహం

ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదులపై కొందరు పోలీస్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడం పట్ల జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు సీఎం, ఇతర మంత్రులు, డిజిపి కార్యాలయాల నుంచి వచ్చిన ఫిర్యాదులపై దృష్టి సారించి స్టేషన్ల వారీగా వచ్చిన ఫిర్యాదులు ఎన్ని, తీసుకున్న చర్యలు ఏమిటి ..?పెండింగ్‌లో ఎన్ని ఉన్నాయి..? అందుకు గల కారణాలు ఏమిటి అనే దానిపై విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది. ఆయా కార్యాలయాల నుంచి వచ్చే ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పోలీస్ అధికారులపై చర్యలకు కూడా సిద్ధమైనట్లు సమాచారం. జిల్లాకు సంబంధించి నాలుగైదు పోలీస్ స్టేషన్లలో ఆయా ఫిర్యాదులు నెలల తరబడి పేరుకుపోయినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం పోలీస్ స్టేషన్‌ల వారీగా సీఎంవో నుంచి వచ్చిన ఫిర్యాదులకు సంబంధించి తీసుకున్న చర్యలు, పెండింగ్ ఫిర్యాదులు వంటి వాటిపై కసరత్తు జరుగుతోంది. పెండింగ్ పిటిషన్లకు సంబంధించి ఆయా స్టేషన్ల జాబితాలో పాత గుంటూరు, నల్లపాడుతో పాటు మరికొన్ని స్టేషన్‌లు ఉన్నట్లు తెలిసింది. ఇప్పటి వరకు అయా ఫిర్యాదులపై జరిగిన జాప్యం నేపథ్యంలో ఇక నుంచి అయినా ఫిర్యాదులను సత్వరం పరిష్కరించేలా చర్యలు తీసుకునేందుకు ఎస్పీ సతీష్ కుమార్ అన్ని పోలీస్ స్టేషన్‌లకు ఆదేశాలు జారీ చేశారు. ఆయా ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఫిర్యాదుల్లో వాస్తవికతపై విచారణ జరిపి అందులో వాస్తవం ఉంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలని ఆదేశించారు.

సమాజ వికాసానికి విద్యార్థులు దోహదపడాలి


డీజీపీ ద్వారకా తిరుమలరావును సత్కరిస్తున్న ఆచార్య గంగాధరరావు

పెదకాకాని, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సమాజ వికాసం భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమనీ, అందుకు తగినట్లుగా నేటితరం విద్యార్థులు అడుగులు వేయాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సీహెచ్ ద్వారకా తిరుమలరావు సూచించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కాలేజి ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో శనివారం ఇండక్షన్ అండ్ ఓరియంటేషన్ ప్రోగ్రామ్ జరిగింది. ఈ కార్యక్రమానికి డీజీపీ ముఖ్యఅతిథిగా పాల్గొని సైబర్ నేరాలు, డ్రగ్స్ ముప్పు వంటి ముఖ్యమైన సమస్యలపై అవగాహన కల్పించారు. డిజిటల్ యుగంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. విద్యార్థులు తమతోపాటు సమాజాన్ని రక్షించుకోవడానికి బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చుకోవాలని కోరారు. ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ఆచార్య కె.గంగాధరరావు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత ప్రాముఖ్యతను గుర్తించాలన్నారు. విద్యార్థులు వినూత్న పరిష్కారాలను అన్వేషించాలని, సాంకేతిక పురోగతికి సహకరించాలని సూచించారు. విశ్వవిద్యాలయంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇన్‌చార్జ్ రెక్టార్ ఆచార్య కె.రత్నషీలామణి మాట్లాడుతూ సమాజాభివృద్ధి, దేశ నిర్మాణంలో ఇంజనీర్ల పాత్ర కీలకమన్నారు. ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం మాట్లాడుతూ సమయపాలన, క్రమశిక్షణ ప్రాముఖ్యతను వివరించారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.సిద్దయ్య, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. గోపికృష్ణ, డాక్టర్ డి.చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

గోవా నుంచి గుంటూరుకు అక్రమ మద్యం రవాణా

● పట్టుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు


నిందితులను అరెస్టు చేసిన ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ శ్రీనివాసులు, ఏఈఎస్ వరదకుమారి

గుంటూరు (కార్పొరేషన్), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తరలించి గుంటూరులో ఒక ప్రాంతంలో రహస్యంగా దాచి మద్యాన్ని సరఫరా చేస్తున్న ఒక కానిస్టేబుల్‌తోపాటు మరో ఐదుగురిని గుంటూరు టూటౌన్ ఎక్సైజ్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. గుంటూరు ఎక్సైజ్ శాఖ డీసీ డాక్టర్ కె.శ్రీనివాసులు శనివారం వివరాలు వెల్లడించారు. గోవా నుంచి గుంటూరుకు ఎన్‌డీపీ మద్యాన్ని తీసుకువచ్చి అమ్ముతున్నారు. సత్తెనపల్లి టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చెందిన కానిస్టేబుల్ వెంకమ్మశెట్టి మహేష్‌బాబు, గుంటూరుకు చెందిన బాజీబాబు, లక్ష్మారెడ్డి, గోపికృష్ణ, రామిశెట్టి శ్రీనివాసు, గోరంట్లకు చెందిన తుమ్మా మంగమ్మ తదితరులు సిండికేట్‌గా మారి మద్యాన్ని యథేచ్ఛగా అమ్ముతున్నారు. నాలుగు రోజుల క్రితం గుంటూరులో గోవా మందు అమ్ముతున్నట్టు ఎక్సైజ్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఒకరిని అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం వ్యవహారం వెలుగులోకి వచ్చింది. 555 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కానిస్టేబుల్ మహేష్‌బాబుతోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచినట్టు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు. సమావేశంలో గుంటూరు ఈఎస్ అరుణకుమారి, ఏఈఎస్ మారయ్యబాబు, టూటౌన్ సీఐ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో ప్రసవించిన విద్యార్థిని

● హాస్టల్‌లో నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలింపు
● అక్కడ ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి
● ఘటనతో ఉలిక్కిపడిన ప్రభుత్వ వర్గాలు
● పోలీసులకు ఫిర్యాదు చేసిన యువతి తల్లిదండ్రులు

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నడిబొడ్డున అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ ఉండే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థినిని ప్రసవించింది. నగరంలోని జిల్లా కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, అదేవిధంగా కలెక్టర్, ఎస్పీ, ఐజి క్యాంపు కార్యాలయాలు, మరోవైపు నగరం పాలెం స్టేషన్.... నిత్యం వీఐపీల రాకపోకలతో కట్టుదిట్టమైన భద్రత నడుమ కొనసాగే సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్లో ఓ విద్యార్థినిని ప్రసవించడం సంచలనం రేకెత్తించింది. . కలెక్టరేట్‌కు, కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి నడుమ పరివర్తన పేరుతో నడుస్తున్న సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థిని శుక్రవారం రాత్రి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ఘటనతో ప్రభుత్వ వర్గాలు ఉలిక్కిపడ్డాయి. విద్యార్థిని ప్రసవించే వరకు విషయం బయటకు రాకపోవడం పట్ల అధికార యంత్రాంగంతో పాటు పోలీసు వర్గాలు సైతం విస్మయానికి గురయ్యాయి. అసలు హాస్టల్స్‌లో ఏమి జరుగుతోంది..? నిఘా ఉందా..? వార్డెన్స్ ఏం చేస్తున్నారు..? వంటి అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తమ కుమార్తె కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకుంటుందని కలలుగన్న తల్లిదండ్రులు ఈ వార్తతో షాక్‌కు గురయ్యారు. పరివర్తన హాస్టల్‌లో ఉంటూ చిలకలూరిపేట రోడ్డులోని ఫార్మసీ కళాశాలలో ఈ విద్యార్థిని బి ఫార్మసీ రెండో సంవత్సరం చదువుతుంది. ప్రకాశం జిల్లా దర్శి ప్రాంతానికి చెందిన 19 సంవత్సరాల విద్యార్థినికి శుక్రవారం రాత్రి నొప్పులు రావడంతో జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ ఆమె ఆడబిడ్డకు జన్మనిచ్చింది. హాస్టల్‌లో ఉంటూ చదువుకోవాల్సిన యువతి తల్లి కావడం సంచలన కలిగించింది. ఓ విద్యార్థిని గర్భం దాలిస్తే ప్రసవించే వరకు ఎలా కనుక్కోలేకపోయారు అనేది ప్రస్తుతం ప్రశ్నార్థకంగా మారింది.

ప్రేమ పేరుతో మోసం చేసిన బావ

తాజాగా పరివర్తన భవనంలో ఆడబిడ్డకు జన్మనిచ్చిన యువతి తన మేనమామ కుమారుడి చేతిలో మోసపోయినట్లు తేలింది. దర్శి మండల పరిధిలోని ఓ గ్రామం కాగా, అదే గ్రామానికి చెందిన తనకు వరుసకు బావ అయ్యే వినోద్ అనే యువకుడు ఆమెను ప్రేమ పేరుతో లొంగదీసుకున్నట్లు తెలిసింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఆమెకు శారీరకంగా దగ్గరయ్యాడు. అయితే ఆ యువతి ప్రసవించే వరకు ఆమె గర్భవతి అనే విషయం ఇక్కడ హాస్టల్ వార్డెన్‌కు గాని, అక్కడ గ్రామంలోని తల్లిదండ్రులకు గాని తెలియదు. విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు శనివారం సాయంత్రం గుంటూరుకు చేరుకున్నారు. జీజీహెచ్‌లో ఉన్న బాలింతను తల్లిదండ్రులు కలిసి బోరున విలపించారు. అయితే వినోద్ నుంచి గాని ఆయన కుటుంబ సభ్యుల నుంచి గాని ఎటువంటి సానుకూలమైన స్పందన రాలేదు. వాస్తవానికి వినోద్ పెళ్లికి అంగీకరిస్తే ఈ విషయాన్ని రెండో కంటికి తెలియకుండా తమ కుమార్తెకు వివాహం చేయాలని తల్లిదండ్రులు భావించారు. వినోద్ కూడా పెళ్లికి అంగీకరిస్తారని ఆ యువతితో పాటు ఆమె తల్లిదండ్రులు కూడా భావించారు. ఆ యువతి తల్లిదండ్రులు ఎట్టకేలకు శనివారం రాత్రి నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మండలానికో గ్రామంలో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే

గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వేని నూతనంగా ముందుకు తీసుకెళ్లాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే అన్ని గ్రామాల్లో డ్రోన్ ఫ్లయింగ్ పూర్తి కావడం, కొన్ని గ్రామాలు మినహా చాలావాటికి ఓఆర్‌ఐలు రావడంతో మిగతా ప్రక్రియని పారదర్శకంగా, పకడ్బందీగా పూర్తి చేయాలని నిర్ణయించింది. రీసర్వేని పటిష్టవంతంగా పూర్తి చేసేందుకు పైలట్ ప్రాజెక్టుగా మండలానికో గ్రామాన్ని ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో మొత్తం 14 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా రీసర్వే చేయాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. తాడికొండ(లచ్చన్నగుడిపూడి), మేడికొండూరు (మందపాడు), తుళ్లూరు (వడ్డమాను), పొన్నూరు (జడవల్లి), దుగ్గిరాల (పెరికలపూడి), చేబ్రోలు (మంచాల), కాకుమాను (పాండ్రపాడు), ఫిరంగిపురం (మేరిగపూడి), ప్రత్తిపాడు (మల్లాయపాలెం), పెదకాకాని (అనుమర్లపూడి), గుంటూరు పశ్చిమ (చినపలకలూరు), గుంటూరు తూర్పు (జొన్నలగడ్డ), తెనాలి(పెదరావూరు), కొల్లిపర(కుంచవరం) గ్రామాల్లో రీసర్వే తొలి దశలో జరగనుంది. ఈ గ్రామాల్లో మొత్తం భూముల విస్తీర్ణం 22,961 ఎకరాలున్నాయి. రోజుకు కేవలం 20 ఎకరాల్లో మాత్రమే రీసర్వేని నిర్వహిస్తారు. గ్రామాన్ని బ్లాకులుగా విభజించి బృందాలను నియమించారు. ఒక్కో బృందంలో వీఆర్‌వో, వీఆర్‌ఏ, ఇద్దరు గ్రామ సర్వేయర్లు, ఒక మండల సర్వేయర్ కూడా ఉంటారు. అడంగల్ ప్రకారం రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వే ప్రక్రియని వారి కనుసన్నల్లోనే చేపడతారు. రీసర్వేకి సంబంధించి గ్రామాల్లో దండోర వేసి చెబుతారు. అలానే గ్రామసభలు కూడా నిర్వహిస్తారు. గ్రామ సరిహద్దులు, ప్రభుత్వ భూములు, పాత హద్దురాళ్లు వంటివి అన్ని ప్రదర్శిస్తారు. జిల్లాలో మొత్తం 173 గ్రామాలుండగా వైసీపీ హయాంలో 62 చోట్ల రీసర్వే పూర్తి అయింది. ఓఆర్‌ఐ(ఆర్థోరెక్టిఫైడ్ రాడార్ ఇమేజ్) మ్యాప్‌లు సుమారు 64 గ్రామాలకు ఇంకా అందాల్సి ఉన్నట్లు సర్వే శాఖ ఏడీ పవన్‌కుమార్ తెలిపారు. ఇవి కూడా త్వరలోనే జిల్లాకు చేరతాయని చెప్పారు. ఏమైనా వివాదాలుంటే డిప్యూటీ తహసీల్దార్ సమక్షంలో జరిగే మొబైల్ మేజిస్ట్రేట్ కోర్టులలో పరిష్కరించుకోవచ్చని సూచించారు.

రెండు స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణ



వేమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-రేపల్లె డెల్టా ఎక్స్‌ప్రెస్‌ను రెండు స్టేషన్‌లలో నిలుపుదల పునరుద్ధరణకు ఎట్టకేలకు రైల్వేశాఖ స్పందించింది. 2020 నుంచి ఐదేళ్లపాటు తెనాలి-రేపల్లె మార్గంలోని వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో డెల్టా ఎక్స్‌ప్రెస్ స్టాప్‌లను రైల్వే శాఖ నిలిపివేసింది. దీంతో ఈ రెండు స్టేషన్‌ల పరిధిలో ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులపై రైల్వే శాఖ దృష్టికి అనేక వినతి పత్రాలు వెళ్లాయి. ఎక్స్‌ప్రెస్ రైలును రెండు స్టేషన్‌లలో నిలుపుదలను పునరుద్ధరించాలని కోరారు. గత ప్రభుత్వంలో ఈ విషయాన్ని నాటి ఎంపీ నందిగం సురేష్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన మాత్రం స్పందించలేదు. గుంటూరు జిల్లా రైల్వే బోర్డు కమిటీ సభ్యులు కూడా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి ఢిల్లీలోని రైల్వేశాఖ ప్రధాన కార్యాలయానికి ప్రత్యేకంగా లేఖలు పంపారు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేదు. దీనిపై ఒత్తిడి పెరగడంతోపాటు కూటమి ప్రభుత్వానికి చెందిన బాపట్ల ఎంపీ కృష్ణప్రసాద్ స్వయంగా ఢిల్లీలోని రైల్వేశాఖ ఉన్నతాధికారులతో చర్చించి వెంటనే ఉత్తర్వుల కోసంగా కృషి చేశారు. శుక్రవారం రైల్వే శాఖ డిప్యూటీ కమిషనర్ దీనిపై ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 23 నుంచి వేమూరు, పల్లెకోన స్టేషన్‌లలో కూడా ఎక్స్‌ప్రెస్ నిలుపుదల పునరుద్ధరణకు ఆదేశాలు జారీ అయ్యాయి. టైంటేబుల్‌ను కూడా ప్రకటించారు. రైలు నంబరు 17645 డెల్టా ఎక్స్‌ప్రెస్ సికింద్రాబాద్ నుంచి వేమూరుకు రాత్రి 7.15 గంటలకు చేరుకుని 7.16 గంటలకు బయలుదేరి రేపల్లెకు వెళ్లనుంది. రైలు వేళలను వేమూరు, పల్లెకోన స్టేషన్ల పరిధిలో విస్తృతంగా ప్రచారం చేయాలని డిప్యూటీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

పరిమళ కుటుంబ సభ్యులకు మంత్రి పరామర్శ


పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి మనోహర్

తెనాలి అర్బన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అమెరికాలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువతి నాగశ్రీ వందన పరిమళ భౌతికకాయానికి శనివారం అంత్యక్రియలు జరిపించారు. వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పరిమళ భౌతిక కాయం శుక్రవారం రాత్రి తెనాలి గాంధీనగర్‌లోని ఇంటికి చేరింది. భౌతికకాయాన్ని చూసేందుకు స్థానికులు భారీ సంఖ్యలో వచ్చారు. ఆమె తల్లిదండ్రులు రోధిస్తున్న తీరు వారికి కంటతడి పెట్టించింది. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మృతదేహానికి నివాళులర్పించారు. పరిమళ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.80 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96.104.115
చికెన్ విత్ స్కిన్	184.00
చికెన్ స్కిన్ లెస్	194.00

వినియోగదారుల హక్కుల దినోత్సవం

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ మహిళా కళాశాలలో శనివారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ బి.నాగమణి అధ్యక్షత వహించగా లీగల్ మెట్రాలజి విభాగం డిప్యూటీ కంట్రోలర్ కె.ఐజక్ ముఖ్యఅతిథిగా పాల్గొని తూనికలు, కొలతలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఫోరంఫర్‌బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ.సాయిబాబు వినియోగదారుల చట్టాలు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎవి.రమణారావు, అధ్యాపకులు డాక్టర్ అబ్దుల్ కలాం, డాక్టర్ భాస్కరరావు, సుశీలావతి, నాగమల్లేశ్వరి, నైమిషా, వసంత, లీగల్ మెట్రాలజి విభాగం ఇన్‌స్పెక్టర్ రామదాసు తదితరులు పాల్గొన్నారు.

మెప్మా పీడీగా సరోజనీ

బాపట్ల,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మెప్మా పీడీగా పి.సరోజనీని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మైనార్టీవెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఆమెను బదిలీపై బాపట్లలో నియమించారు. గతంలో చీరాల ఆర్డీవోగా ఆమె పనిచేశారు. అదేవిధంగా పాఠశాల విద్యాశాఖలో పనిచేస్తున్న ఎం.నాగిరెడ్డిని పదోన్నతిపై బాపట్ల జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా నియమించారు.

వెంకటసుధాలక్ష్మి మృతి తీరని లోటు : వేగేశన

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 4వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పరిశా రమేష్‌గౌడ్ భార్య వెంకటసుధాలక్ష్మి మృతి తీరనిలోటు అని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. అనారోగ్యంతో మృతి చెందిన ఆమె భౌతికకాయాన్ని పార్టీశ్రేణులతో కలిసి శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. పుష్పాంజలి ఘటించి ఆమె మృతికి సంతాపం ప్రకటించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. రమేష్‌గౌడ్‌ను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కర్పూరపు రామారావు తదితరులు ఉన్నారు.

బీఈసీలో జాతీయ గణిత శాస్త్ర దినోత్సవం

బాపట్ల,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం జాతీయ గణితశాస్త్ర దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా మ్యాథమేటిక్స్ బ్రిడ్జింగ్ ఐడియాస్ అండ్ ఇన్నోవేషన్స్ అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. విద్యార్థులలో గణితశాస్త్రంపై మక్కువ పెంచుతూ వారిలో కంప్యూటేషనల్ స్కిల్స్ పెంచటానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. 500మంది సాంకేతిక విద్యార్థులు పాల్గొన్నారు. కన్వీనర్‌గా గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ కె.వి.ఎల్.ఎన్ ఆచార్యులు వ్యవహరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్.నజీర్, అధ్యాపకులు డాక్టర్ ఎం.బాలయ్య, డాక్టర్ టి.రామలింగేశ్వరరావు, కె.నాగమణి, డాక్టర్ పి.విజయసారధి, మహ్మద్‌అబ్దుల్ ఖాదర్, డాక్టర్ తన్నీరు శ్రీనివాసరావు, నాళం కరుణాకర్, డాక్టర్ కె.మణిదీప్, ఎం.లెనిన్‌బాబు, ఎస్.ప్రభుదాసు, నల్లూరి శ్రీకాంత్, ఐ.పోతురాజు ప్రసంగించారు. కార్యక్రమంలో భాగంగా గణితశాస్త్ర పితామహుడు శ్రీనివాస రామానుజన్ పటానికి పుష్పాంజలి ఘటించారు.

బీఎల్‌సీ స్కీమ్‌కి దరఖాస్తు చేసుకోవాలి

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ



హౌసింగ్ అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రాంతంలో నివేశన స్థలాలు ఉన్న ప్రజలు సొంత ఇంటి కల సాకారం చేసుకునేందుకు బీఎల్‌సీ స్కీమ్ కింద 300 గృహాలు మంజూరు చేయటం జరిగిందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. ఈ విషయమై హౌసింగ్ అధికారులతో శనివారం ఆయన సమీక్షించారు. సొంత స్థలం ఉన్నవారు గృహ నిర్మాణ సంస్థ నుంచి ఇంటి నిర్మాణం మంజూరు కొరకు దరఖాస్తు చేసుకోవచ్చు అని చెప్పారు. ఒక్కొక్క ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.5 లక్షలు ఇవ్వటం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలోనే పేదవాడి సొంత ఇంటి కల సాకారమౌతుందన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ వై.వెంకటేశ్వర్లు, డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ జీవిఎస్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ధ్యానం ద్వారా జ్ఞాపక శక్తి పెరుగుతుంది : ఎమ్మెల్యే వేగేశన

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ధ్యానం ద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం వరల్డ్ మెడిటేషన్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ ధ్యానం ఆవశ్యకత గుర్తించి ఐక్యరాజ్యసమితిలో వరల్డ్ మెడిటేషన్ డే జరుపుకోవాలని నిర్ణయించటం జరిగిందన్నారు. ధ్యానం ద్వారా మైండ్‌కు బలం వస్తుందన్నారు. మెడిటేషన్ సెంటర్ ఇన్‌చార్జి మానం మల్లేశ్వరి మాట్లాడుతూ విద్యార్థులు ధ్యానం చేయటం వల్ల ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఒత్తిడి నుంచి బయట పడగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఐ.హరిత, సుబ్రహ్మణ్యం, మురళి, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలకు పరిష్కారం

చుండూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూ సంబంధిత సమస్యలు ఎదుర్కొంటున్న గ్రామస్తులు తమ గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ రెవెన్యూ సభలు ద్వారా పరిష్కారం పొందవచ్చునని తహసీల్దార్ దేవరకొండ నాగరాజు తెలిపారు. శనివారం యడ్లపల్లిలో గ్రామ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తుల నుండి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ షేక్ ముంతాజ్‌బేగం, డిటి ఎస్.శ్రీనివాసరావు, పంచాయితీ కార్యదర్శి పావులూరి నేతాజీ, రెవెన్యూ సిబ్బంది బి.బాలశౌరి పాల్గొన్నారు.

● భట్టిప్రోలు, కొల్లూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొల్లూరు మండల పరిధిలోని ఈపూరు, చినపులివర్రు గురివిందపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈపూరు 6, చినపులివర్రులో 3 అర్జీలు అందినట్లు తహసీల్దార్ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. భట్టిప్రోలు మండల పరిధిలోని గుత్తావారిపాలెంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో దేవాదాయ భూములకు సంబంధించిన సమస్యలపై నలుగురు రైతుల నుంచి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు అర్జీలు స్వీకరించారు. ఆయా కార్యక్రమాల్లో డిటి శ్రీనివాసరావు, సర్వేయర్ హర్షవర్ధన్, ఎండోమెంట్ ఈవో దీవి వెంకటప్పాలచార్యులు, నాగిశెట్టి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు మైనేని మురళీకృష్ణ, మల్లంపాటి హరిబాబు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

● పిట్టలవానిపాలెం,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భవనంవారిపాలెం గ్రామపంచాయతీ, సచివాలయాల పరిధిలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్ అధ్యక్షతన రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ, దేవదాయ శాఖకు సంబంధించిన అధికారులతో శనివారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. మొత్తం 31 అర్జీలను తహసీల్దార్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, సర్వేయర్ ఆదిరామచంద్రరావు, భవనంవారిపాలెం సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

● నగరం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని తమ భూసమస్యలను పరిష్కరించుకోవాలని పీడీ డబ్ల్యూఎంఏ స్పెషలాఫీసర్ ఏబీ విజయలక్ష్మి అన్నారు. ఆమె శనివారం బెల్లంవారిపాలెం పంచాయతీలో జరిగిన రెవెన్యూసదస్సులో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ మొత్తం 11అర్జీలు అందాయని వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ జీ.నాంచారయ్య డిప్యూటీ తహసీల్దార్ సత్యన్నారాయణ, మండల సర్వేయర్ వీఏగోపాల్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీతో యానాదుల అభ్యున్నతి సాధ్యం

బాపట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : యానాదుల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యమని యానాది హక్కుల పోరాట సమితి అధ్యక్షులు తిరువీధుల శంకరప్రసాద్ పేర్కొన్నారు. ఉండవల్లిలో రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసిన ఆయన యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. వైసీపీ పాలనలో యానాదులకిచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వంలో యానాది కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

ప్రతిపాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తప్పనిసరిగా ఉండాలి

● బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి

● గైర్హాజరైన ప్రధానోపాధ్యాయులకు ఛార్జీమెమో ఇవ్వాలి

బాపట్ల,డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రతిపాఠశాలలో ఫిర్యాదుల బాక్స్ తప్పనిసరిగా ఉండాలని బాలల హక్కుల కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. పట్టణంలోని అన్నం సతీష్ ప్రభాకర్ కాపు కళ్యాణ మండపంలో శనివారం జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. పద్మావతి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రతినెల ఫిర్యాదుల బాక్స్‌ని సీపీసి కమిటీ సమక్షంలో తెరిచి సమస్యలు పరిష్కరించాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలకు సంబంధించిన అన్ని రకాల సర్టిఫికెట్స్ పరిశీలించి సరిగ్గా ఉన్నాయో లేదో చూడాలని డీఈవోను ఆదేశించారు. కార్యక్రమానికి గైర్హాజరైన ప్రధానోపాధ్యాయులకు ఛార్జీమెమో ఇవ్వాలన్నారు. ఫ్రీ ఎడ్యుకేషన్‌లో ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులపై ఫీజు వసూళ్ళకు, తల్లికి వందనం డబ్బులు పడేంతవరకు ఒత్తిడి చేయరాదని తెలిపారు. మధ్యాహ్నం భోజనం పథకంలో ప్రభుత్వం నిర్ణయించిన మెనూ తప్పకుండా పాటించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.పురుషోత్తం, అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఇ.మురళి, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి పి.యద్రయ్య, ఉపవిద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖాధికారులు, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీడీవో

కర్లపాలెం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండలంలోని సమ్మెటవారిపాలెం పంచాయతీ పరిధిలో గల శీలంవారిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని శనివారం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలోని రికార్డులు, హాజరు పట్టీలను పరిశీలించారు. చిన్నారులతో ముచ్చటించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు.



కేక్ కట్‌చేస్తున్న పంతాని మురళీధరరావు, మంత్రి సోదరుడు శివప్రసాద్

చివరిభూముల వరకు సాగునీరు అందించేందుకు కృషిచేస్తా

● కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని

రేపల్లె, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కృష్ణా పశ్చిమడెల్టాలోని కాల్వలు, డ్రైయిన్‌లను సమష్టి కృషితో అభివృద్ధి చేస్తామని నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు అన్నారు. ఉప్పూడిరోడ్డులోని స్థానిక టీడీపీ కార్యాలయంలో పదవీబాధ్యతలు స్వీకరించిన శనివారం భారీ కేక్‌ను పంతాని మురళీధరరావు, మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ కట్ చేసి మిఠాయిలను పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారి ఇరువురిని గజమాలతో టీడీపీ నాయకులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెవెన్యూశాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ ఈ పదవిని కట్టబెట్టి బాధ్యతను మరింత పెంచారని వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా విధులు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు, నర్రా సుబ్బయ్య, కొపనాతి రాజశేఖర్, తాతా ఏడుకొండలు, కుమారస్వామి, బొమ్మిడి రామకృష్ణ, కొక్కిలిగడ్డ వెంకటేశ్వరరావు, కొక్కిలిగడ్డ ధనుంజయరావు, కేసన రామకృష్ణ, మత్తి శ్రీను, దేవగిరి రవి, ఓగిబోయిన వెంకట్‌యాదవ్, కొలసాని రాము, నల్లూరు అజయ్, పిన్నిబోయిన చింతారావు, గుర్రం మురహరిరావు, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, రాసంశెట్టి మహేష్, దేవగిరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మురళీధరరావుకు పలువురు అభినందనలు

అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి) 21 : కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా మోర్తోట డిసి పంతాని మురళీధరరావు ఎన్నికైన సందర్భంగా రాష్ట్ర మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ శనివారం అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను అనగాని శివప్రసాద్ పూలమాలలు, శాలువాతో అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తొట్టెంపూడి సుబాష్, పిన్నెబోయిన చింతారావు, మేకా వెంకటశివరామకృష్ణ, మల్లాది రామకృష్ణ, ఎంఆర్‌కె మూర్తి, దండుప్రోలుపిచ్చియ్య, రేపల్లె సురేష్, వెనిగళ్ల సుబ్రహ్మణ్యం, మద్రాసు సాంబశివరావు, కొలసాని రాము, నల్లపాటి ఎల్లయ్య తదితరులు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

స్థానిక నాయకులు..

ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌గా ఎన్నికైన పంతాని మురళీధరరావుకు స్థానిక టీడీపీ నాయకులు అభినందనలు తెలిపారు. ప్రాజెక్టు కార్యాలయంలో ఆయనను కలసి శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, యలవర్తి బ్రహ్మానందం, తుమ్మల భుజంగరావు, యలవర్తి రఘుబాబు, మేకా రాంబాబు, కావూరి సత్యనారాయణ, బాజీ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

అమృతలూరు, డిసెంబరు (ఆంధ్రజ్యోతి)21 : గృహ నిర్మాణ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలంటూ ఆ శాఖ అవుట్ సోర్సింగ్ సిబ్బంది రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధికి శని వారం వినతిపత్రం అందజేశారు. మండలంలోని కూచిపూడి కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ కార్యాలయానికి విచ్చేసిన మంత్రికి తమ సమస్యలపై విన తి పత్రం ఇచ్చారు. కొన్ని సంవత్సరాల నుంచి పనిచేస్తున్న తమకు వేతనం రూ.15 వేలు మాత్రమే ఇస్తున్నారన్నారు. పరిశీలిస్తామని వారికి మంత్రి హామీ ఇచ్చారు.

గ్రీన్‌గ్రేస్ అపార్ట్‌మెంట్‌ని కాపాడేందుకు తెరచాటు ప్రయత్నాలు

- ఎన్‌వోసీ జీవోని సవరిస్తూ రహస్య ఉత్తర్వులు
- ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నాయకులు
- సీఎం చంద్రబాబుకు నివేదన



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నడిబొడ్డున తగిన అనుమతులు లేకుండా నిర్మిస్తున్న గ్రీన్‌గ్రేస్ హైరైజ్ బిల్డింగ్స్‌ని కాపాడేందుకు పైస్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయి. కీలకమైన రైల్వే ఎన్‌వోసీ రద్దుకు సంబంధించి సవరణలు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలుగుదేశం పార్టీ నాయకులకు సమాచారం అందింది. మునిసిపల్ పరిపాలన శాఖలోనే కొంతమంది హైరైజ్ బిల్డింగ్స్‌ని నిర్మిస్తున్న వైసీపీ నేత అంబటి మురళీకృష్ణకు సానుకూలంగా అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్నట్లు అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. ఎన్‌వోసీ రద్దు సవరణ ఉత్తర్వులు రహస్యంగా విడుదల చేయడం ఇందుకు ఊతమిస్తున్నది. రహస్య జీవో సమాచారాన్ని ఆర్‌టీఐ ద్వారా సేకరించిన టీడీపీ నేతలు విషయాన్ని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది.

భజరంగ్ జూట్‌మిల్లుకు చెందిన వివాదాస్పద స్థలాన్ని వైసీపీ నేత అంబటి మురళీకృష్ణ తన ఆధీనంలోకి తీసుకొని తొలుత ఐదు అంతస్తుల అపార్టుమెంట్ల నిర్మాణానికి మునిసిపల్ పరిపాలన శాఖ నుంచి అనుమతులు పొందారు. అయితే వైసీపీ ప్రభుత్వ హయాంలో రివైజ్డ్ ప్లాన్ దరఖాస్తు చేసి దానికి అనుమతి రాకముందే 15 అంతస్తుల భవన సముదాయాలను నిర్మించారు. ఈ క్రమంలో ఎన్నో నిబంధనలను అతిక్రమించారు. గుంటూరు - నల్లపాడు రైలుమార్గానికి ఆనుకునే నిర్మాణాలు చేపట్టారు. రైల్వే నుంచి ఐదు అంతస్తుల భవన సముదాయాలకు మాత్రమే ఎన్‌వోసీ తీసుకొన్నారు. ఎప్పుడైతే అంతకంటే ఎక్కువ అంతస్తుల నిర్మాణం చేపట్టారో రైల్వే శాఖ తాను జారీ చేసిన ఎన్‌వోసీ రద్దు అయినట్లే భావించాలని పేర్కొంటూ తగిన చర్యలు చేపట్టాలని నగరపాలకసంస్థ అధికారులకు సమాచారం ఇచ్చింది. అయితే అప్పట్లో అంబటి మురళీకృష్ణ సోదరుడు అంబటి రాంబాబు మంత్రిగా ఉండడంతో ఏ ఒక్క ప్రభుత్వ శాఖ అధికారి, సిబ్బంది గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్ ప్రాంగణంలోకి అడుగుపెట్టే సాహసం చేయలేకపోయారు.

కాగా ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓటమిపాలై ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ ఆర్‌టీఐ ద్వారా ఉల్లంఘనలన్నింటిని వెలుగులోకి తీసుకొచ్చారు. 15 అంతస్తులకు బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ రాకపోవడం, సెట్‌బ్యాక్స్ సరిగా లేకపోవడం, రైలు పట్టాల నుంచి దూరంగా నిర్మాణాలు చేపట్టాల్సి ఉండగా కేవలం 50 అడుగుల దూరంలోనే నిర్మాణాలు చేయడం, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అనుమతులు లేకపోవడం వంటివి అనేక ఉల్లంఘనలు బయటకు వచ్చాయి. రైల్వే ఎన్‌వోసీ రద్దుపై కోర్టుకు వెళ్లినా అంబటి మురళీకృష్ణకు ఊరట లభించలేదు. కాగా మునిసిపల్ పరిపాలన శాఖలో కొంతమంది ఆయనకు సహకరిస్తున్నారన్న అనుమానాలు ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను బట్టి కలుగుతున్నాయి. ఈ క్రమంలో కొంతమంది మునిసిపల్ అధికారులు, మురళీకృష్ణ సామాజికవర్గానికి చెందిన టీడీపీ ప్రజాప్రతినిధులు గ్రీన్‌గ్రేస్ అపార్టుమెంట్స్‌ని కాపాడేందుకు ప్రయత్నిస్తున్నారని టీడీపీ గుంటూరు జిల్లా నాయకలు సందేహిస్తున్నారు. ఎన్‌వోసీ రద్దు సవరణ జీవోని రహస్యంగా ఇచ్చిన విషయంపై తాడోపేడో తేల్చుకోవాలని భావిస్తున్నారు. దీనిపై సీఎం ఏ విధంగా స్పందిస్తారో చూడాలి.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సునీల్‌చౌదరికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి

(5వ పేజీ తరువాయి)

నాశనమైందన్నారు. సాగు నీటి రంగంలోని సమస్యలను గుర్తించి, రైతులకు మేలు జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మరుగునపడిన వ్యవస్థను గాడిలో పెడతానికి చంద్రబాబు నడుం బిగించారని ఇందులో భాగంగానే సాగు నీటి సంఘాల ఎన్నికలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగ పడే వ్యవస్థలను జగన్మోహనరెడ్డి నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయలు మాట్లాడుతూ సాగు నీటి రంగం చంద్రబాబు మానసపుత్రిక అన్నారు. నూతన కమిటీ ప్రతి ఎకరాకు నీరందించే విధంగా పని చేస్తుందన్నారు.

కాల్వలు, డ్రైయిన్లు ఆధునికీకరిస్తాం : చైర్మన్

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేయలేదన్నారు. పట్టిసీమ నీటిని కూడా అందించలేదన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించి సాగునీటిసంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అధ్వానంగా తయారైన కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేసి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(5వ పేజీ తరువాయి)

ఆధునికీకరించి సాగునీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కాల్వ చివరి భూములకు సాగునీ రు అందించేందుకు ప్రయత్నిస్తామని చక్రపాణి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్ల సాగునీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నీటి సరఫరాలో రైతులను భాగస్వాములను చేసిందన్నారు.



సాగర్ పీసీ చైర్మన్ ఎన్నికలో పాల్గొన్న డీసీల అధ్యక్షులు

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట : యరపతినేని

సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ ప్రాజెక్టు సాగునీరు అందిస్తున్నా వైసీపీ హయాంలో కాల్వల మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రులు, డీసీల సహకారంతో గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు.

పరీక్షా కాలమ్



చిక్కులను అవగతం చేసుకుని చదివితే..

భౌతికశాస్త్రంలో అత్యధిక మార్కులు సులువే



అడుసుమల్లి రవికుమార్, భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు

గుంటూరు(విద్య), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సహజంగా విద్యార్థులు భయపడే సబ్జెక్టులలో భౌతిక శాస్త్రం కూడా ఒకటి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ విద్యా సంవత్సరం సీబీఎస్ఈ పాఠ్య పుస్తకాలు ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. ఎందుకంటే ప్రభుత్వం ఇప్పటికే రాష్ట్రమంతటా స్టేట్ బోర్డు పరీక్షలను నిర్వహించడానికి సన్నద్ధమయింది. 2025లో జరిగే పదో తరగతి పరీక్షలలో సైన్స్ పరీక్ష భౌతిక శాస్త్రం, జీవశాస్త్రాలకు విడివిడిగా వేర్వేరు రోజులలో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందువల్ల అటు విద్యార్థుల్లోనూ ఇటు ఉపాధ్యాయుల్లోనూ ఆనందం వ్యక్తం అవుతోంది. ఎందుకంటే గతంలో రెండు సబ్జెక్టులను కలిపి ఒకే పేపర్‌గా నిర్వహించడం వల్ల విద్యార్థులు ఎన్నో ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయని పెదనందిపాడు మండలం, పుసులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు, అడుసుమల్లి రవికుమార్ తెలిపారు. ఇక ఇప్పుడు 2025లో జరగబోవు పబ్లిక్ పరీక్షలలో భౌతిక శాస్త్రంలో అత్యధిక మార్కులు తెచ్చుకోవడానికి విద్యార్థులకు ఆయన ఇచ్చే సూచనలు ఇలా ఉన్నాయి...

- ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సిఆర్‌టి ద్వారా మోడల్ పేపర్లను, బ్లూ ప్రింట్‌ను విడుదల చేసి అన్ని పాఠశాలలకు పంపించి తగిన మార్గదర్శనం చేసింది. విద్యార్థులు ఈ బ్లూ ప్రింట్‌ను పరిశీలిస్తూ, ఆయా పాఠ్యాంశాలకు ఉన్న వెయిటేజీకి అనుగుణంగా ప్రిపరేషన్ మొదలుపెట్టాలి.
- భౌతికశాస్త్రం ప్రశ్నపత్రం మొత్తం నాలుగు సెక్షన్లుగా 17 ప్రశ్నలతో ఉంటుంది. మొదటి సెక్షన్‌లో 1 నుంచి 8 వరకు ఒక మార్కు ప్రశ్నలు ఉంటాయి. ఈ ఎనిమిది ప్రశ్నలలో పటం వెయ్యడం, పట్టికను చూసి సమాధానాలు రాయడం, కారణాలు ఊహించడం ఉపయోగాలు తెలపడం, ప్రమాణాలు రాయడం అనే విద్యా ప్రమాణాలు కచ్చితంగా ఇస్తారు కాబట్టి విద్యార్థులు వీటిపై దృష్టి పెట్టాలి.
- రెండవ సెక్షన్‌లో 9 నుంచి 11 వరకు రెండు మార్కుల ప్రశ్నలు ఇస్తారు. వీటిలో రెండు ప్రశ్నలు కారణాలు ఊహించడం, ప్రశ్నించడం వంటి విద్యా ప్రమాణాలకు సంబంధించి ఉంటాయి. కాబట్టి విద్యార్థులు ఈ దిశగా సాధన చేయాలి.
- మూడవ సెక్షన్‌లో 12 నుంచి 14 వరకు నాలుగు మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ప్రశ్న సంఖ్య 12 పటం గీయాలి. ఈ ప్రశ్నకు అంతర్గత ఎంపిక ఉంటుంది విద్యార్థులు గనక పటాలను చక్కగా సాధన చేసినట్లయితే, ఈ ప్రశ్న ద్వారా సులువుగా నాలుగు మార్కులను పొందవచ్చు. ముఖ్యంగా పుటాకార దర్పణం, కుంభాకార కటకానికి సంబంధించిన కిరణ చిత్రాలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- ఇదే సెక్షన్‌లో ఉపయోగాలు రాయడం విద్యా ప్రమాణానికి సంబంధించిన ప్రశ్న కూడా ఉంటుంది కాబట్టి బ్లీచింగ్ పౌడర్ ఉపయోగాలు, బేకింగ్ సోడా ఉపయోగాలు, వాషింగ్ సోడా ఉపయోగాలు, నిజ జీవితంలో లోహాల పాత్ర, పి.హెచ్ ప్రాముఖ్యం తదితర అంశాలను విద్యార్థులు క్షుణ్ణంగా చదివి నాలుగు మార్కులను సంపాదించే ప్రయత్నం చేయాలి.
- ఇక మరో ప్రశ్నగా పట్టిక ఇచ్చి పట్టిక కింద ప్రశ్నలు అడుగుతారు కాబట్టి పాఠ్య పుస్తకంలో ఇచ్చిన పట్టికలను విద్యార్థులు తప్పనిసరిగా సాధన చేయాలి.
- నాలుగో సెక్షనులో 15 నుంచి 17 వరకు 8 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. 15వ ప్రశ్న భౌతిక శాస్త్రం నుంచి, 16వ ప్రశ్న రసాయన శాస్త్రం నుంచి, 17వ ప్రశ్న భౌతిక రసాయన శాస్త్రాల అంతర్గత ఎంపిక తోనూ ప్రశ్నలను అడుగుతారు.
- ముఖ్యంగా 17వ ప్రశ్న ఒక కృత్యాన్ని గురించిన ప్రశ్న కావడం వలన విద్యార్థులందరూ కూడా కృత్యాలకు సంబంధించిన ప్రశ్నలను సాధన చేసినట్లయితే కచ్చితంగా ఎనిమిది మార్కులు తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- ప్రశ్నపత్రం మొత్తం మీద విషయావగాహన, అంశాలను వివరించడం, కృత్యాలను రాయడం, ప్రశ్నించడం, ఊహించడం, కారణాలు తెలపడం, ఉపయోగాలు రాయడం, ప్రమాణాలు రాయడం, పటాలు గీయడం వంటి విద్యా ప్రమాణాలను సాధన చేస్తే విద్యార్థులందరూ దాదాపు 70శాతం మార్కులను తెచ్చుకునే అవకాశం ఉంటుంది.
- భౌతిక శాస్త్రం అనగానే విద్యార్థులలో సహజంగా కొంత భయం ఉన్నప్పటికీ, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన పని ఏమీ లేదు. భయాన్ని వీడి ఆత్మవిశ్వాసంతో విద్యా ప్రమాణాల ఆధారంగా ప్రశ్నపత్రంలోని బ్లూప్రింట్ వెయిటేజ్‌ను దృష్టిలో ఉంచుకొని పరీక్షలకు సన్నద్ధమైతే విజయం తథ్యమని భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడు అడుసుమల్లి రవికుమార్ వివరించారు.

మార్కెట్లోకి మామిడి పండ్లు

- ఆసక్తిగా తిలకిస్తున్న ప్రజలు... అడపా దడపా కొనుగోళ్లు
- కిలో రూ.250కు విక్రయం



మార్కెట్లో దర్శనమిస్తున్న మామిడి పండ్లు

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మార్కెట్లో మామిడి పండ్లు దర్శనమిస్తున్నాయి. సాధారణంగా మామిడి పండ్లు వచ్చే రుతువుకు భిన్నంగా మార్కెట్లోకి రావడంతో ప్రజలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. లాలాపేట పండ్ల మార్కెట్లో రెండు రోజులుగా తోపుడు బండిపై మామిడి పండ్లు కనిపించడంతో ప్రజలు అడపా దడపా కొనుగోళ్లు చేస్తున్నారు. సాధారణంగా మండు వేసవిలో మామిడి పండ్ల సీజన్ ప్రారంభమవుతుంది. అలాంటిది రుతువుకు భిన్నంగా ప్రస్తుతం బంగినిపల్లి మామిడి పండ్లు మార్కెట్లో దర్శనమివ్వడంతో ప్రజలు ఆశ్చర్యంగా పరిశీలిస్తున్నారు. కొనుగోలు చేసేందుకు కొందరు ఆసక్తిగా చూపుతున్నారు. డజను పండ్లు రూ. 800ల నుంచి రూ.వెయ్యి వరకు విక్రయిస్తుండగా కిలో రూ.250ల వరకు విక్రయిస్తున్నట్లు లాలాపేటలో పండ్ల వ్యాపారి షేక్ జిలాని తెలిపారు. ప్రస్తుతం అనంతపురం జిల్లాలో బంగినపల్లి మామిడి పంట అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. బెంగళూరు, చెన్నై వంటి దూర ప్రాంతాలకు ఆయా మామిడి పండ్లను ఎగుమతి చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులుగా విక్రయాలు జరుపుతున్నామని, అడపా దడపా కొనుగోళ్లు జరుగుతున్నాయని సదరు వ్యాపారి వివరించారు. మరికొన్ని రోజులు మాత్రమే అందుబాటులో ఉంటాయని తెలిపారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

గుంటూరు(విద్య), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో పది విద్యార్థులకు శనివారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఎన్నారై నూకవరపు శ్రీకాంత్ ఆర్థిక సహాయంతో ప్రభుత్వ ఉపాధ్యాయులచే రూపొందించబడిన స్టడీ మెటీరియల్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, ఎస్‌ఎఫ్ఐ గుంటూరు నగర అధ్యక్ష, కార్యదర్శులు యశ్వంత్, సమీర్ తదితరులు పాల్గొన్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



గుంటూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాజీపేట - విజయవాడ సెక్షన్‌లో మోటుమర్రి వద్ద నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా గుంటూరు నుంచి ఆ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లను రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నంబరు. 12705 గుంటూరు - సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్, నంబరు. 12706 సికింద్రాబాద్ - గుంటూరు రైలును ఈ నెల 28, 29, జనవరి 2, 5, 7, 8, 9 తేదీల్లో పూర్తిగా రద్దు చేస్తున్నామన్నారు. నంబరు. 17201/17202 గుంటూరు - సికింద్రాబాద్ - గుంటూరు గోల్కొండ్ ఎక్స్‌ప్రెస్‌ని ఈ నెల 27 నుంచి జనవరి 9వ తేదీ వరకు కాజీపేట వరకే నడిపి వెనక్కు మళ్లించడం జరుగుతుందన్నారు. ఈ నెల 26 నుంచి జనవరి 8వ తేదీ వరకు నంబరు. 18519 విశాఖపట్టణం - ముంబై ఎల్‌టీటీ, జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు నంబరు. 18045 షాలిమార్ - హైదరాబాద్, జనవరి 7 నుంచి 9వ తేదీ వరకు నంబరు. 18046 హైదరాబాద్ షాలిమార్, నంబరు. 17205 సాయినగర్ షిర్డి - కాకినాడ పోర్టు రైలుని జనవరి 7న, నంబరు. 17206 కాకినాడ పోర్టు - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17207 సాయినగర్ షిర్డి - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 8న, నంబరు. 17208 మచిలీపట్నం - సాయినగర్ షిర్డి ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ - వికారాబాద్ మీదగా దారి మళ్లించడం జరుగుతుందన్నారు. నంబరు. 11019 ముంబై సీఎస్‌ఎంటీ - భువనేశ్వర్, నంబరు. 11020 భువనేశ్వర్ - ముంబై సీఎస్‌ఎంటీ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 6 నుంచి 8వ తేదీ వరకు, వాడి - వికారాబాద్ - సికింద్రాబాద్ - పగిడిపల్లి - గుంటూరు - విజయవాడ మీదగా దారి మళ్లిస్తామన్నారు. నంబరు. 22849 షాలిమార్ - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 1, 8 తేదీల్లో, నంబరు. 20833 విశాఖపట్టణం - సికింద్రాబాద్ విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి -సికింద్రాబాద్ మార్గంలో దారి మళ్లిస్తామని తెలిపారు. నంబరు. 12774 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్‌ని జనవరి 7న రాజమండ్రి - విజయవాడ - గుంటూరు - పగిడిపల్లి - సికింద్రాబాద్ మీదగా దారి మళ్లిస్తామన్నారు. ఆపరేషనల్ కారణాల వలన ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు నంబరు. 07276 కాచీగూడ - మిర్యాలగూడ, నంబరు. 07277 మిర్యాలగూడ - నడికుడి, ఈ నెల 27 నుంచి మార్చి 1వ తేదీ వరకు నంబరు. 07973 నడికుడి - మిర్యాలగూడ, నంబరు. 07974 మిర్యాలగూడ - కాచీగూడ రైళ్లను రద్దు చేశామన్నారు. నంబరు. 07791 కాచీగూడ - నడికుడి, నంబరు. 07792 నడికుడి - కాచీగూడ రైలుని ఈ నెల 26 నుంచి జనవరి 28వ తేదీ వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజ పురోగతి

- మన్నవ మోహనకృష్ణ



రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్లో పాల్గొన్న ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): టెక్నాలజీ అభివృద్ధితోనే సమాజం పురోగమిస్తుందని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. ఎస్సార్ఎం యూనివర్శిటీలో శనివారం జరిగిన రెండో రీసెర్చ్ స్కాలర్స్ సమ్మిట్‌కు ఆయన ముఖ్య అతి థిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మోహనకృష్ణ మాట్లాడుతూ మారుతున్న సమా జానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు టెక్నాలజీ అభివృద్ధి చెందుతోందని, టెక్నాలజీతో సమాజం మరింత ముందుకు సాగుతుందని చెప్పారు. నూతన టెక్నాలజీని కనుగొనేం దుకు చేసే ప్రయత్నాలకు కూటమి ప్రభుత్వం ఎంతో ప్రోత్సహం అందిస్తుందని చెప్పారు. నేటి తరానికి టెక్నాలజీపై అవగాహన ఉండటం అవసరమని అన్నారు.

● శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి

శాస్త్ర, సాంకేతిక రంగాలతోనే అభివృద్ధి సాధ్యమని ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ అన్నారు. విజయవాడలోని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో విభాగాధిపతులు, అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విభాగాలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ద్వారా అందిస్తున్న సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ ప్రొక్యూర్మెంట్స్ ఇంకా విస్తృత పరిచి ఏపీటీఎస్‌కి మరింత ఆదాయం పెంచాలని సూచించారు.

174 వసంతాల ఆర్‌సీఎం చర్చి




రెంటచింతల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పల్నాడు జిల్లా రెంటచింతలలో నిర్మించిన చర్చిలు జిల్లాకే తలమానికంగా ఉంటాయి. ఎంతో ఎత్తుండే ఈ ప్రార్థనాలయాల శిఖరాలను చూడడానికి తల నిటారుగా ఎత్తాల్సిందే! ఆర్‌సీఎం మతస్తులు అధికంగా ఉండే ఈ గ్రామంలో 1850లో కానుకమాత చర్చిని నిర్మించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం రాకముందు అనగా 97 సంవత్సరాల పూర్వమే రూ.4 వేల వ్యయంతో అప్పట్లో ఈ చర్చి రూపుదిద్దుకుంది. 1832లో బ్రిటీష్ ఈస్టు ఇండియా కంపెనీకి చెందిన బ్రట్ జేమ్స్ దాసన్ క్రీస్తు ప్రార్థనా మందిర నిర్మాణానికి పూనుకోగా అది 1850లో పూర్తయినట్టు మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి చెప్పారు. 70 అడుగుల ఎత్తు 1000 మంది భక్తులు కూర్చోనే విధంగా ఈ ప్రార్థనా మందిరాన్ని తీర్చిదిద్దారు. అప్పట్లో సిమెంట్ లేకపోవడంతో సున్నంతో గానుగ ఆడించి నాపరాళ్లతో నిర్మించారు. ఆ రోజుల్లో ఫాదర్ ఆదేశాల మేరకు ప్రతి క్రైస్తవ కుటుంబం నుంచి ఒకరో ఇద్దరు వచ్చి నిర్మాణ పనుల్లో పాలుపంచుకునే వారు. 13 ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ చర్చికి అనుబంధంగా 1978లో మరో చర్చిని నిర్మించారు. దీనిని ప్రస్తుతం రూ.5 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు ఫాదర్ వైఎల్ మర్రెడ్డి చెప్పారు. 174 వసంతాలు నిండినా ఆ చర్చి చెక్కు చెదరకపోవడం విశేషం.

గొప్పవారి స్ఫూర్తితో విజేతలుగా ఎదగాలి

- ఘనంగా ప్రారంభమైన వివా వీవీఐటీ 2024-25



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థినులు..



మాట్లాడుతున్న వీవీఐటీ కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): యువజనోత్సవాలు విద్యార్థులలో నాయకత్వ లక్షణాలను పోటీతత్వాన్ని పెంపొందిస్తాయని విజ్ఞాన్ నిరులా ప్రిన్సిపాల్ పాతూరి రాధిక అన్నారు. వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో జాతీయస్థాయి యువజనోత్సవం వివా-వీవీఐటి 2024-25 వేడుకలు ఘనంగా శనివారం ప్రారంభమయ్యాయి. కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ జాతీయపతాకాన్ని ఆవిష్కరించి, క్రీడాజ్యోతిని వెలిగించి ఈకార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాధిక మాట్లాడుతూ, విద్యార్థులు తల్లిదండ్రుల కలలను సాకారం చేసేలా కృషి చేయాలని అన్నారు. గొప్పవారి నుంచి స్ఫూర్తిపొంది విజేతలుగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమానికి నేపథ్యంగా ఎంచుకున్న ది వరల్డ్ ఈజ్ వన్ (ప్రపంచమంతా ఏకం) నేపథ్యాన్ని ప్రతిబింబించేలా వసుధైక కుటుంబాన్ని చాటేలా కళాశాల ప్రాంగణం మొత్తం ప్రపంచ దేశాలలోని సంస్కృతులు, పురాణాల ఆకృతులతో తీర్చిదిద్దారు. హిందూ తత్వశాస్త్రం, తాత్విక, భౌతిక భావనలను కలిగివున్న పవిత్ర సాధనం శ్రీచక్రం ఆకృతి ఆకట్టుకుంది. విభిన్న సంస్కృతులు, సంప్రదాయాల వస్త్రధారణతో కూడిన ప్రతిరూపాలను యువజనోత్సవ ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. సాంస్కృతిక, సాంకేతిక, క్రీడా విభాగాల నుంచి 94 అంశాలలో పోటీలు నిర్వహించగా వివిధ కళాశాలకు చెందిన 4500 మంది విద్యార్థులు ఈ పోటీలలో పాల్గొన్నారు. తొలిరోజు విద్యార్థులు పెద్ద ఎత్తున క్రీడా పోటీలలో పాల్గొని విశేషంగా రాణించారు. తొలిరోజు ముగింపు కార్యక్రమంలో అతిథులుగా వీవీఐటి కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, వి జాన్సన్ అండ్ జాన్సన్ ఐటి మేనేజర్ ఆదిశేషారెడ్డి, అమెరికన్ ప్రొఫెసర్ దండు రాజు పాల్గొన్నారు. తొలిరోజు పోటీలలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందచేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపల్ వై. మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ ఎస్. కుమారస్వామి అధ్యాపకులు పాల్గొన్నారు.



యువజన ఉత్సవాల్లో పాల్గొన్న విద్యార్థులు, అధ్యాపకులు. కళాశాల యాజమాన్యం

ఇద్దరు రైల్వే అధికారులకు జాతీయ అవార్డులు



జేవీ అనూష, రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్)



పీ ఆదినారాయణ, సీనియర్ సెక్షన్ ఇంజనీర్(కన్‌స్ట్రక్షన్)

గుంటూరు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్‌కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులకు జాతీయ స్థాయి అవార్డులు లభించాయి. శనివారం న్యూఢిల్లీలో జరిగిన 69వ రైల్వే వారోత్సవాల్లో ఈ అవార్డులను రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ప్రదానం చేశారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్(కో-ఆర్డినేషన్) జవ్వాది వెంకట అనూషకు కొత్త ఆవిష్కరణలు, ప్రక్రియలు, ఆర్థిక వ్యవస్థలలో చేసిన కృషికి అతి విశిష్ట సేవా పురస్కార్-2024 అవార్డు లభించింది. అలానే గుంటూరు - గుంతకల్లు డబ్లింగ్‌లో కొన్ని విభాగాలను పూర్తి చేయడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ సెక్షన్ ఇంజనీర్ పీ ఆదినారాయణకు కూడా అవార్డు లభించింది. వీరిద్దరిని గుంటూరు డీఆర్ఎం ఎం రామకృష్ణ, ఇతర అధికారులు ప్రత్యేకంగా అభినందించారు.



హెల్మెట్ ధరించిన వాహనదారుని అభినందిస్తున్న డీఎస్పీ

హెల్మెట్‌తో ప్రాణాలకు రక్ష

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనదారులు ప్రమాదాల నుంచి ప్రాణాలు కాపాడు కోవచ్చని చీరాల డీఎస్పీ మహ్మద్ మొయిన్ అన్నారు. శనివారం మేదరమెట్ల, కొరిశపాడు పోలీస్‌స్టేషన్‌లను వార్షిక తనిఖీలో భాగంగా ఆయన తనిఖీ చేశారు. రికార్డులను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కొరిశపాడు పోలీస్ స్టేషన్ వద్ద నుంచి ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ఉపయోగాలను వివరిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు.

జాతీయ రహదారిలో అత్యధిక ప్రమాదాలు రోడ్డు మార్జిన్‌లో వాహనాలు నిలపడంవల్లే జరుగుతున్నాయని డీఎస్పీ మొయిన్ అన్నారు. అనుమతి ఉన్న చోట మాత్రమే వాహనాలు నిలిపేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో డ్రైవర్లు నిద్రలోకి జారుకోకుండా రాత్రి 3 గంటల సమయంలో లారీలను ఆపి మొఖం కడుగుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకోవడం వలన ఎన్నో కుటుంబాలను కాపాడవచ్చు అన్నారు. ఈ సందర్భంగా హెల్మెట్ ధరించి వెళ్తున్న వాహనదారుడికి పండు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జున రావు, మేదరమెట్ల, కొరిశపాడు, జె.పంగులూరు ఎస్‌ఐలు మహమ్మద్ రఫీ, సురేష్, వినోద్ బాబుతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ : ద్విచక్ర వాహనాలను హెల్మెట్‌లు లేకుండా నడిపితే చర్యలు తప్పవని ఎస్ఐ జీవీ చౌదరి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని వేమవరం నాలుగు రోడ్ల కూడలిలో ద్విచక్ర వాహనాలు నడుపుతున్న పలువురికి హెల్మెట్‌ల వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. హెల్మెట్ ధరిస్తే ప్రాణ రక్షణ కలుగుతుందని చెప్పారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడంవల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు. కార్యక్రమంలో రైటర్ శివ కృష్ణ ఉన్నారు.

మార్టూరు : హెల్మెట్లను వాహనాలు నడిపే సమయంలో ధరించడం వలన ప్రమాదాలబారి ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఎం.శేషగిరిరావు పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద హెల్మెట్ల వినియోగంపై వాహన దారులకు సీఐ అవగాహన కల్పించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ సైదా, ఏఎస్ఐ బాషా తదితరులు పాల్గొన్నారు.

చిన్నారుల దాతృత్వం వెలకట్టలేనిది



వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ తంబీ జోసఫ్

పర్చూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వృద్ధులకు సాయం అందించాలన్న చిన్నారుల సంకల్పం వెలకట్టలేనిదని ప్రిన్సిపాల్ కొండవీటి తంబీ జోసఫ్ అన్నారు. మండలం నాగులపాలెం గ్రామంలోని ఎస్ఎఫ్ఎస్ పాఠశాలలోని విద్యార్థులు క్రిస్మస్ పండుగ సందర్భంగా సమకూర్చిన నగదుతో 40 మంది నిరుపేద వృద్ధులకు దుప్పట్లను ప్రిన్సిపాల్ పంపిణీ చేశారు. అంతకముందు సెమీ క్రిస్మస్ వేడుకను నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రేమ, దయ ఉండాలి : వెలుగు పీడీ పద్మ

క్రీస్తు బోధనలు అనుసరణీయమని, ప్రతి ఒక్కరితోనూ ప్రేమ, దయ కలిగి ఉండాలని వెలుగు బాపట్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ పి.పద్మ అన్నారు. శనివారం వెలుగు కార్యాలయంలో ఏపీఎం రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రద్యుమ్నకుమార్, ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మణాచారి, ఏపీఎం రామకృష్ణ, ఉన్నతి ఏపీఎం ఫణిబాబు, స్త్రీనిధి మేనేజర్ కరుణాకర్, సీసీలు విజయ్ కుమార్, శ్రీనివాస మూర్తి, ప్రమీల, నరసింహారావు, ఝాన్సీరాణి పాల్గొన్నారు.

మోర్తోట డీసీ అధ్యక్షుడే చైర్మన్



కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్‌గా ఎన్నికైన సునీల్‌చౌదరికి నియామక పత్రం అందజేస్తున్న ఎస్ఈ అబూదలేమ్, ఆర్డీవో రామలక్ష్మి

(5వ పేజీ తరువాయి)

నాశనమైందన్నారు. సాగు నీటి రంగంలోని సమస్యలను గుర్తించి, రైతులకు మేలు జరిగేలా కమిటీ చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ మరుగునపడిన వ్యవస్థను గాడిలో పెడతానికి చంద్రబాబు నడుం బిగించారని ఇందులో భాగంగానే సాగు నీటి సంఘాల ఎన్నికలన్నారు. రైతులకు ఎంతో ఉపయోగ పడే వ్యవస్థలను జగన్మోహనరెడ్డి నాశనం చేశారన్నారు. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ సాగు నీటి రంగం చంద్రబాబు మానసపుత్రిక అన్నారు. నూతన కమిటీ ప్రతి ఎకరాకు నీరందించే విధంగా పని చేస్తుందన్నారు.

కాల్వలు, డ్రైయిన్లు ఆధునీకీకరిస్తాం : చైర్మన్

కృష్ణా పశ్చిమ డెల్టా పరిధిలోని కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేస్తామని బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్మన్ పంతాని మురళీధరరావు తెలిపారు. జగన్‌రెడ్డి పాలనలో కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేయలేదన్నారు. పట్టిసీమ నీటిని కూడా అందించలేదన్నారు. రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారించి సాగునీటి సంఘాలను ఏర్పాటు చేశారన్నారు. అధ్వానంగా తయారైన కాల్వలు, డ్రైయిన్లను అభివృద్ధి చేసి చివరి భూములకు కూడా సాగునీరు అందించేందుకు కృషిచేస్తామన్నారు.

ఇసుకను తోడేస్తున్నారు!

కనిగిరి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రాంతంలో ఇసుక అక్రమ రవాణా జోరుగా సాగుతుంది. నెల్లూరు ప్రాంతం నుంచి సీనరీజ్‌కు ఎగనామం పెట్టి అక్రమమార్గంలో ఇసుక రవాణా జరుగుతుంది. మరోపక్క కనిగిరి ప్రాంతంలోని చెరువు, అలుగువాగు మేటలనూ వదలకుండా ఇసుకను తోడేస్తూ ప్రభుత్వ విధానాలకు తూట్లు పొడుస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇసుక అక్రమ వ్యాపారంలో అడ్డేలేకుండా సాగించినవారికి ప్రభుత్వం మారినా వారిదే పైచేయిలా సాగుతుంది. వైసీపీ నేతలు వెనుకుండి వారి అనుయాయులను కూటమి పార్టీల్లో తిప్పుతూ అక్రమ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా మైనింగ్ అధికారులు కళ్ళప్పగించి చూస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.నాగులచెరువు, చినిర్లపాడు, పునుగోడు, ఏరువారిపల్లి, బొమ్మిరెడ్డిపల్లి, తాళ్లూరు, యడవల్లి, దిరిశవంచ, కమ్మవారిపాలెం, కంచర్లవారిపల్లి, గ్రామాల్లోని అలుగు వాగులు, పీసీపల్లి మండలంలోని అలవలపాడు, గుదేవారిపాలెం, రామాపురం, మర్రిపూడి మండలం నర్సాపురం ప్రాంతాల్లో ఇసుక మేటను తవ్వుతూ అక్రమ మార్గంలో అమ్మకాలు సాగిస్తున్నారు.

నేడు సీతారామస్వామి దేవస్థాన పునర్‌నిర్మాణ పూజలు

చినగంజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : చినగంజాం గ్రామంలోని అన్నపూర్ణ థియేటర్ పక్కనే ఉన్న సీతారామస్వామి దేవస్థానం పునర్ నిర్మాణ పూజలు ఆదివారం ఉదయం 7గంటల నుంచి నిర్వహించనున్నట్లు దేవస్థాన అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి వెంకటరామానుజం, మోటుమర్రి రామసుబ్బారావు తెలిపారు. గ్రామంలో సుమారు వంద సంవత్సరాల చరిత్ర గల సీతారామస్వామి దేవాలయంలో నిత్య నైవేద్యాలు సాగక మూతపడి శిథిలమై ఉంది. స్వామి వారి దేవాలయ ద్వార బంధం, సింహ ద్వారం తెరిచే కార్యక్రమాన్ని ఆగమ శాస్త్ర పండితులు అగ్నిహోత్రం వెంకటశేషాచార్యులు ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7గంటల నుంచి విశ్వక్సేనారాధన, పుణాహవచనం, వాస్తు పూజ, పంచగవ్య ఆరాధన, ప్రోక్షణ తదనంతరం అగ్నిప్రతిష్ఠాపనం, శాంతి హోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ద్వారాలు తెరిచే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. 2006వ సంవత్సరం నుంచి దేవాలయంలోని సీతారాముల ఉత్సవ విగ్రహాలు స్థానిక భూ సమేత భావనారాయణస్వామి దేవస్థానంలో ఉన్నట్లు తెలిపారు. నాటి నుంచి ప్రతి శ్రీరామనవమి పర్వదినాన భావనారాయణస్వామి దేవస్థానం అభివృద్ధి కమిటీ సభ్యులు భావనారాయణ కల్యాణ మండపంలో ఉత్సవ విగ్రహాలతో స్వామి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరుపుతున్నారు. సీతారామస్వామి దేవాలయంలో నాడు చినగంజాం, సోపిరాల తదితర గ్రామాల్లోని ప్రజలు తమ పిల్లలకు వివాహాది శుభకార్యక్రమాలు దేవాలయంలోనే జరుపుకునేవారిని గ్రామ పెద్దలు చెప్తున్నారు. ఆలయాన్ని నూతనముగా నిర్మాణం చేయటకు గ్రామస్థులు సంకల్పించి కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ సభ్యులు రూ.39 లక్షల రూపాయిలను ప్రజలు, భక్తుల నుంచి విరాళాల రూపంలో సేకరించి దేవాలయ నిర్మాణానికి పూనుకున్నారు. ఇటీవల చినగంజాం పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కమిటీ సభ్యుల వినతి మేరకు దేవాలయాన్ని పరిశీలించారు. ఆదివారం జరిగే దేవాలయ పునఃనిర్మాణ పూజలకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు. దేవాలయ హంసద్వారం తెరిచే కార్యక్రమాన్ని తిలకించేందుకు భక్తులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు.



మూతపడిన పురాతన సీతారామస్వామి ఆలయం

శాస్త్రోక్తంగా ప్రారంభమైన పూజలు

పంగులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : కొండమంజులూరు గ్రామంలో శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా శనివారం వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఉదయం 6 గంటలకు సుప్రభాతం అనంతరం విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచన, పంచగవ్య ఆరాధన, పంచగవ్య ప్రాసన, వాస్తుపూజ, అగ్ని ప్రతిష్ఠాపన, వాస్తు హోమం, పద్యుజీకరణం, అకల్మష హోమం, బింది శుధ్యర్థం, నవ కలశ, పంచగవ్యాధివాసం, పంచాగ్ని ప్రణయనం, నివేదన, హారతి పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాదవినియోగం జరిగింది. సాయంత్రం గ్రామోత్సవం, మహిళా కోలాటం ఘనంగా నిర్వహించారు. అనంతరం సాయంసవనం, నవగ్రహ ఆరాధన, అవహన కుంభాభిమర్శనం, సర్వదైవత్య హోమం, హారతి, తీర్థప్రసాద వినియోగం జరిగాయి. వేద మంత్రోచ్చరణతో శాస్త్రోక్తంగా జరిగిన కార్యక్రమాలలో పలువురు దంపతులు పాల్గొన్నారు



యాగశాలలో పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు

క్లీన్ అండ్ గ్రీన్ ప్రకాశం

- జిల్లావ్యాప్తంగా పారిశుధ్యం, పచ్చదనం కార్యక్రమాలు ప్రారంభం
- టంగుటూరు, సూరారెడ్డిపాలెంలలో పాల్గొన్న కలెక్టర్, పరిశీలించిన మంత్రి స్వామి
- ప్రభుత్వ కార్యాలయాలు, విద్య, వైద్య సంస్థల్లో పరిశుభ్రతపై దృష్టి
- ప్రతినెలా మూడవ శనివారం నిర్వహణ
- ప్రభుత్వ ఉత్తర్వుల కన్నా ముందే కలెక్టర్ చొరవ


ఒంగోలు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పరిశుభ్రత, పచ్చదనం కార్యక్రమాలు శనివారం అధికార యంత్రాంగం నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా గతంలో వలే మళ్లీ క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించాలని ప్రతినెల మూడవ శనివారం అందుకు కేటాయించాలని ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశించారు. అందుకు సంబంధించి త్వరలో ఉత్తర్వులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అయితే ఉత్తర్వులు అందక మునుపే జిల్లాలో ఈ కార్యక్రమం అమలుకు కలెక్టర్ తమీమ్ అన్సారియా చొరవ చూపారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వ ఆదేశాలతో స్వచ్ఛతహీ సేవా కార్యక్రమం నడుస్తుండగా అన్నింటిని కలిపి 'పరిశుభ్రత ప్రకాశం, పచ్చదనం ప్రకాశం' నినాదంతో ప్రతినెల మూడవ శనివారం కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించారు. ఆ మేరకు శుక్రవారం రాత్రి అందరూ అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తగు సూచనలు చేయగా శనివారం ఉదయం జిల్లా అంతటా ఈ కార్యక్రమాలు చేపట్టారు. కలెక్టర్ అన్సారియా టంగుటూరులో లాంఛనంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం అదే మండలంలోని సూరారెడ్డిపాలెంలోనూ పాల్గొన్నారు. అక్కడ ఈ కార్యక్రమాన్ని మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి పాల్గొని పరిశీలించారు. దళితవాడలో వీధులు, డ్రైన్లు పరిశుభ్రత పనులను పర్యవేక్షించారు. ప్రకాశం భవన్‌లో కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, డీఆర్వో ఓబులేషులు చీపురు పట్టి చిమ్మి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు జేసీ గోపాలకృష్ణ మద్దిపాడులో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ కార్యాలయ ప్రాంగణాలు, విద్యాసంస్థలు, హాస్టళ్లు, వైద్యశాలలు తదితర ప్రాంతాలలో స్థానిక అధికారులు, సిబ్బంది పరిశుభ్రత కార్యక్రమాన్ని పాటించారు. ప్రతినెల మూడవ శనివారం ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు.



చెత్తను ఊడ్చుతున్న కలెక్టర్ అన్సారియా, జేసీ గోపాలకృష్ణ, అధికారులు

భూ ప్రకంపనలు

- ఇళ్లలో పడిపోయిన వస్తువులు
- బయటకు పరుగులు తీసిన విద్యార్థులు
- ఆందోళనతో ఇళ్లలో నుంచి వచ్చిన ప్రజలు



ముండ్లమూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గంలో శనివారం స్వల్ప భూప్రకంపనలు సంభవించాయి. ముండ్లమూరు, తాళ్లూరు, కురిచేడు మండలాల్లో ఉదయం 10.32 సమయంలో రెండు సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరు, పసుపుగల్లు, వేంపాడు, సింగనపాలెం, పోలవరం, శంకరాపురం, నూజెండ్లపల్లి, సుంకరవారిపాలెం, మారెళ్ళ, జమ్ములమడక, నాయుడుపాలెం, తమ్మలూరు, ఉమామహేశ్వర అగ్రహారం, పూరిమెట్ల, ఈదర, భీమవరం, వేములబండ గ్రామాల్లో భూమి కంపించింది. పసుపుగల్లులోని గూడాల శివశంకర్‌రెడ్డి ఇంట్లో మచ్చు మీద పెట్టిన సామాన్లు సైతం కింద పడిపోయాయి. శంకరాపురంలో కూడా పలు ఇళ్లలోని సామాన్లు సైతం భూమి అదిరిన శబ్దానికి కింద పడిపోయాయి. పోలవరం, ముండ్లమూరు పాఠశాలల్లో విద్యార్థులు బయటకు పరుగులు తీశారు. ముండ్లమూరులో పోలీసులు ఏర్పాటుచేసి సీసీ కెమెరాల్లో భూమి కంపించిన దృశ్యాలు స్పష్టంగా నమోదయ్యాయి.

పెద్ద శబ్దం రావటంతో భయంతో పరుగులు తీశాం

పసుపుగల్లు, ముండ్లమూరు మండలం ఒక్కసారిగా పెద్ద శబ్దం రావటం, భూమి వణికినట్లుగా కన్పించటంతో ఇంట్లో నుంచి ఒక్కసారిగా భయంతో పరుగులు తీసి రోడ్డు మీదకు వచ్చాను. మా ఊరిలో వారంతా ఒక్కసారిగా భూకంపం రావటంతో పరుగులు తీశారు. ఇంట్లో వస్తువులన్నీ చెల్లాచెదురుగా కింద పడిపోయాయి.



- గూడాల శివ శంకర్‌రెడ్డి,

కురిచేడులో..

కురిచేడు : కురిచేడులో రెండు సెకన్లపాటు స్వల్ప భూకంపం సంభవించింది. భూమి లోపల నుంచి కొద్దిపాటి శబ్దం వచ్చింది. స్థానికులు పెద్దగా దీనిని పరిగణనలోకి తీసుకోలేదు. శబ్దం వచ్చిన వెంటనే భవనాల నుంచి బయటకు వచ్చారు. మరలా ఎటువంటి శబ్దాలు రాకపోడంతో ప్రజలు ఎవరి పనులకు వారు వెళ్లిపోయారు.

తాళ్లూరులో ..

తాళ్లూరు :మండలంలోని పలుగ్రామాల్లో శనివారం ఉదయం పెద్ద శబ్దంతో భూమి కంపించటంతో ప్రజలు ఆందోళన చెందారు. తాళ్లూరు, తూర్పుగంగవరం, కొర్రపాటివారిపాలెం, కొత్తపాలెం రమణాలవారిపాలెం తదితర గ్రామాల్లో రెండు సెకన్లపాటుపెద్ద శబ్దంతో భూమిలో ఏదో వెళుతున్నట్లు అలజడి కన్పించింది. నేలపై కాళ్లు అదిరాయి. తాళ్లూరులో ఎరువుల దుకాణంలోని బస్తాలు కింద పడ్డాయని దుకాణం యజమాని తెలిపారు. భూకంపం రావటంతో ప్రజలు భయాందోళన చెందారు.

జిల్లాకు ముగ్గురు ఎస్‌డీసీలు

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు ముగ్గురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు నియమితులయ్యారు. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇరిగేషన్ (ఎల్‌ఏ) వెలిగొండ ప్రాజెక్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా కె.శ్రీధర్‌రెడ్డి, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్‌డీసీగా సిహెచ్.విజయజ్యోతి కుమారి, కేఆర్‌సీసీ ఎస్‌డీసీగా కె.చిన్నయ్యను నియమించారు.

కేజీబీవీ విద్యార్థినులకు మోడల్ పేపర్లు పంపిణీ

సీఎస్‌పురం(పామూరు), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండల కేంద్రంలోని కేజీబీవీ పదో తరగతి విద్యార్థినులకు యూటీఎఫ్ ప్రచురించిన మోడల్ పేపర్లను ఎంఈవో జె.ప్రసాదరావు శనివారం ఉచితంగా పంపిణీ చేశారు. పదో తరగతి పరీక్షల్లో మంచి ర్యాంకులు సాధించేలా ప్రణాళికలు రూపొందించుకొని లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షేక్ రేష్మ, యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. వెంకట్రామయ్య, షేక్ సాదుషా, తదితరులు పాల్గొన్నారు.



వివాదాన్ని పరిష్కరించిన అనంతరం ఇరువైపుల వారితో మాట్లాడుతున్న తహసీల్దార్ పార్వతి

కొత్తపేట శ్మశాన వాటిక వివాదం పరిష్కారం

తహసీల్దార్ పార్వతి

కొత్తపేట(చీరాల), డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : కొత్తపేట శ్మశాన వాటికకు సంబంధించిన వివాదం నేపథ్యంలో శనివారం తహసీల్దార్ పార్వతి స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఇరువైపులా వారితో మాట్లాడి సమస్యను పరిష్కరించారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆ శ్మశాన వాటిక స్థలాన్ని కొలిచి హద్దులు నిర్ణయించాలని కొందరు, తన తండ్రి సమాధి తొలగించారని ఎన్. ఏకలవ్య అనే వ్యక్తి సోమవారం నిర్వహించే కలెక్టర్ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చారు. దీనిపై గతంలో క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ చేపట్టారు. ఆ క్రమంలో తాజాగా ఇరువైపుల వారితో స్థానిక పంచాయతీ కార్యాలయంలో మాట్లాడి ఎన్. ఏకలవ్య, మరో ఇరువురు గ్రామస్థులు ఏకపక్షంగా ప్రహరీ గోడపై పగలగొట్టిన సమాధుల నామ ఫలకం ఏర్పాటు చేసేలా నిర్ణయం తీసుకున్నారు. అందుకు ఇరువైపుల వారు అంగీకరించారని దీంతో దీర్ఘకాలంగా నెలకొన్న సున్నితమైన సమస్యకు పరిష్కారం లభించిందని తహసీల్దార్ తెలిపారు. అలానే శ్మశాన స్థలం 78 సెంట్లు ఉందని పేర్కొన్నారు. చర్చల అనంతరం ఇరువైపుల వారిని చేతులు, చేతులు కలిపించి స్నేహపూర్వక వాతావరణం కల్పించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

గణితంపై ఆసక్తిని పెంచుకోవాలి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు గణితం పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అన్నారు. శనివారం కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ 138వ జయంతి సందర్భంగా కళాశాల గణిత విభాగం ఆధ్వర్యంలో జాతీయ గణిత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత గణిత అధ్యాపకుడు బీ నారాయణ రావు హాజరై రామానుజన్ జీవిత విశేషాలను వివరించారు. కార్యక్రమంలో గణిత శాస్త్రం విభాగం అధిపతి డాక్టర్ సిహెచ్. సురేష్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం కార్యక్రమం ప్రిన్సిపాల్ డాక్టర్ వీ మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. విద్యార్థులకు వినియోగదారులు హక్కులు, సంబంధిత చట్టలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎంవీ సత్యనారాయణ, కామర్స్ విభాగాధిపతి ఏ. శిఖామణి, వి.ప్రసాద్, బీ అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు

- ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు
- రామాపురం తీరంలో వాహనాల తనిఖీ



రామాపురంలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

వేటపాలెం(చీరాల), డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలకు విరుద్ధంగా మద్యం అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు స్పష్టం చేశారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి అక్రమంగా మద్యం తరలిస్తారనే సమాచారం మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో శనివారం మండల పరిధిలోని రామాపురంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా ఎవరు మద్యంను తరలించినా, విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీహరి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్



కార్యక్రమంలో పాల్గొన్న రియాజ్, నాయకులు, కార్యకర్తలు

సంతమాగులూరు, డిసెంబరు 21 : (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ రియాజ్ తెలిపారు. సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామంలో జనసేన పార్టీ కార్యకర్తల సమావేశంలో రియాజ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో అద్దంకి నియోజకవర్గ జనసేన నాయకులు చల్లా వెంకట కృష్ణారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కారంపూడి డీసీ అధ్యక్షుడే చైర్మన్

(5వ పేజీ తరువాయి)

ఆధునికీకరించి సాగు నీటి విషయంలో రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. అద్దంకి బ్రాంచ్ కాల్వ చివరి భూములకు సాగునీరు అందించేందుకు ప్రయత్నిస్తామని చక్రపాణి తెలిపారు. అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గత ఐదేళ్ల సాగు నీటి సంఘాలను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి నీటి సరఫరాలో రైతులను భాగస్వాములను చేసిందన్నారు.

రైతుల ప్రయోజనాలకు పెద్దపీట : యరపతినేని

సాగర్ ఆయకట్టులో ప్రతి ఎకరాకు నీరందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేస్తామని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస రావు తెలిపారు. 11 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగర్ ప్రాజెక్టు సాగు నీరు అందిస్తున్నా వైసీపీ హయాంలో కాల్వల మరమ్మతులు చేయకపోవడంతో రైతులు అవస్థలు పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిధులు కేటాయించి పనులు చేపట్టామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, నాలుగు జిల్లాల ఎమ్మెల్యేలు మంత్రులు, డీసీల సహకారంతో గురజాలకు చెందిన పులుకూరి కాంతారావు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం హర్షణీయమన్నారు.

వైసీపీ పాపం..ప్రయాణికులకు శాపం



దారుణంగా ఉన్న పర్చూరు - ఇంకొల్లు మధ్య రోడ్డు



దగ్గుబాడు వద్ద ఇలా



గుంతలతో అధ్వానంగా ఉన్న నూతలపాడు - వంకాయలపాడు రహదారి

- పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు వీడని గ్రహణం
- మరమ్మతులకూ నోచుకోని వైనం
- గుంతలతో అధ్వానం
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు

పర్చూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలకుల పాపం ప్రయాణికులకు శాపంగా మారింది. పర్చూరు - ఇంకొల్లు వెళ్లే (పాతమద్రాస్)రోడ్డుకు గ్రహణం వీడేలా లేదు. కనీస మరమ్మతులకు కూడా నోచుకోకపో వడంతో పెద్ద పెద్ద గుంతలు, కంకర రాళ్లు తేలి ప్రమాదాలకు కారణంగా మారింది. ఈ రోడ్డులో ప్రయాణమంటేనే నరకమని వాహనచోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక చోట వాహన దారులు ప్రయాదాలకు గురవుతున్న పరిస్థితి నెల కొంది. వానలు పడితే దారుణంగా మారుతుంది. నిత్యం వందల సంఖ్యలో వాహనాల రాకపోకలతో రోడ్డు బాగా దెబ్బతిన్నది. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో 2022లో ఈరోడ్డు నిర్మాణానికి రూ.22కోట్ల సీఆర్ఎఫ్ నిధులను మంజూరు చేసింది. ఆ నిధులతో కల్వర్టులు, సైడ్ డ్రేన్‌లతోపాటు రోడ్డు నిర్మాణం చేపట్టాల్సి ఉంది. అయితే ఆ కాంట్రాక్టర్ ఈరోడ్డులో కల్వర్టులు, సైడ్ డ్రైన్‌లతో సరిపెట్టారు. అప్పటిలో చేసిన పనులకు కూడా బిల్లులు చెల్లించక పోవడంతో కాంట్రాక్టర్ చేసేది లేక పనులను అర్థాంతరంగా నిలిపేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డు మరమ్మతుకు కూడా నోచుకోక అధ్వానంగా తయారైంది. ఎవరో చేసిన పాపం..ఇలా ప్రయాణి కులకు, ప్రజలకు శాపంగా మారింది. తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వెంటనే కూటమి ప్రభుత్వం పర్చూరు - ఇంకొల్లు రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

మరమ్మతుల మాటే లేదు

గత వైసీపీ పాలనలో రోడ్ల అభివృద్ధి మాటే లేదు. రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల రోడ్లు బాగులేక ఘోర ప్రమాదాలు జరిగినా పాలకు స్పందించలేదు. తాజాగా రోడ్ల అభివృద్ధిపై సీఎం చంద్రబాబు స్పందించారు. సంక్రాంతి పండుగ నాటికి గ్రామ, పట్టణ రోడ్లను బాగు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. దీనికి సంబంధించి నిదులు మంజూరు చేశారు. అయితే పర్చూరు - ఇంకొల్లు రోడ్డుకు గతంలోనే టెండర్ పూర్తి కావడంతో మరమ్మతులకు కూడా నోచుకోలేదు.

దీనిపై ఆర్అండ్‌బీ అధికారి నళిని వివరణిస్తూ పర్చూరు-ఇంకొల్లు రోడ్డు పరిస్థితిపై ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పలు రోడ్ల మరమ్మతులు మొదలయ్యాయి. ఈ రోడ్డు విషయంలో సాంకేతిక సమస్య ఉంది. త్వరలోనే సమస్య పరిష్కారమై రోడ్డు నిర్మాణం జరుగుతుందని తెలిపారు.



అలవలపాడులో మాట్లాడుతున్న తహసీల్దార్ సింగారావు

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ సింగారావు

పంగులూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యల పరిష్కారానికి రైతులు సహకరించాలని తహసీల్దార్ సింగారావు కోరారు. మండలంలోని అలవలపాడు గ్రామంలో శనివారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. విస్తీర్ణ వ్యత్యాసాల సవరణకు రైతులు సర్వేకు సహకరించాలన్నారు. రైతులు తమ దృష్టికి తెచ్చిన సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. పట్టాదారు పాసు పుస్తకాలకు 10 మంది, సర్వే కోసం ఐదుగురు దరఖాస్తులను అందజేశారు. కార్యక్రమంలో సర్వేయర్ సురేష్, వీఆర్వో, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంకొల్లు : మండలంలోని నూదివారిపాలెం, నాగండ్ల గ్రామాలలో శనివారం జరిగిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై 6 అర్జీలు అందినట్లు తహసీల్దార్ వెంకటరత్నం తెలిపారు. కార్యక్రమంలో దేవదయశాఖ అధికారి ఎం.శ్రీనివాస రావు, సర్వేయర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నేత్రదానం

అద్దంకిటౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శనివారం నేత్రదానం జరిగింది. పట్టణంలోని సూర్యారావు(54) అనారోగ్యంతో మృతి చెందారు. రోటరీ నేత్ర విభాగం డైరెక్టర్ మురళీసుధాకరరావు కుటుంబ సభ్యుల సహకారంతో శంకర కంటి వైద్యశాల వైద్యులు డాక్టర్ ఆకాంక్ష బృందం సూర్యారావు కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరయ్య, ఏజీ షేక్ మహమ్మద్ రఫీ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

మార్టూరు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రజలంతా పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా డీఐవో వెంకటేశ్వర్లు కోరారు. మండలంలోని జొనతాళి గ్రామాన్ని వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సందర్శించారు. అనంతరం ప్రాథమికోన్నత పాఠశాలను పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్యాధికార్లు సౌజన్య, రేష్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

శునకాలతో భయం..భయం!

- ఒకేరోజు 18 మందిని కరిచిన కుక్కలు
- యాంటీ రేబిస్ కోసం ఆసుపత్రుల వద్ద క్యూ కడుతున్న బాధితులు

మేదరమెట్ల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మేదరమెట్లలో కుక్కల దాడులతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మందలమందలుగా కుక్కలు రోడ్లపై ఇష్టానుసారం తిరుగుతూ ద్విచక్రవాహనదారులను, విద్యార్థులను కరుస్తున్నాయి. ఈ సమస్య మేదరమెట్లలోనే కాదు, మండలంలోని అన్ని గ్రామాలల్లో తీవ్రంగా ఉంది. ప్రతి రోజూ మేదరమెట్ల, కొరిశపాడు, ప్రాసంగులపాడు పీహెచ్‌సీలతో పాటు ప్రైవేట్ ఆసుపత్రుల్లో కుక్కలు కరిచిన వారు మందుల కోసం క్యూ కడుతున్నారు. యాంటీ రేబిస్ ఇంజక్షన్‌లు వేయించుకుంటున్నారు. వారిలో చిన్నారులను, వృద్ధులు ఎక్కువగా వస్తున్నారని వైద్య సిబ్బంది చెప్తున్నారు. మూడు రోజుల కిందట ఒకేసారి 18 మందిని కుక్కలు కరిచి ఇంజక్షన్ కోసం హాస్పిటల్‌కు వచ్చారని మేదరమెట్ల ప్రాథమిక ఆరోగ్య క్రేంద్రం సిబ్బంది తెలిపారు. ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారిని వెనుక నుంచి కరవడంతో వారు కిందపడి గాయపడుతున్నారు. డిడైవర్‌ల పైనుంచి కుక్కలు దూకడంతో ద్విచక్రవాహనదారులు కిందపడి గాయపడుతున్నారు. ఎక్కడి నుంచో వందల సంఖ్యలో కుక్కలు వచ్చాయి. కుక్కల దాడిలో గాయపడిన పలువురు పంచాయతీ అధికారులను కలువగా తామేమి చేయలేమంటూ చేతులు ఎత్తేస్తున్నారు. మండలంలోని ప్రజలు కుక్కలు సమస్యకు పరిష్కారం చూపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



బల్లికురవ ప్రధాన రహదారిపై కుక్కల గుంపు

జరజాగ్రత్త

- నామ్ రోడ్డులో వీధిలో గుంపులు గుంపులుగా సంచారం
- ఆందోళనలో వాహనచోదకులు

బల్లికురవ : తరచూ గ్రామాలలో శునకాలు ద్విచక్రవాహనాలకు అడ్డుగా వచ్చి ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పుడు వీధి శునకాలు రాష్ట్రీయ రహదార్లపై సంచారం చేస్తుండడంతో వాహనచోదకుల్లో భయం భయం నెలకుంది.

బల్లికురవ మండల పరిధిలో ఉన్న అద్దంకి నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారి రామాంజనేయపురం గ్రామం సమీపంలో రోడ్డుపై వీధి కుక్కల గుంపు గుంపులుగా సంచరిస్తుండడంతో వాహన చోదకులు ప్ర మాదాలబారిన పడుతున్నారు. ఈ కుక్కల ను చూడకుండా వాహనాలను నడిపే వారు ప్రమాదాలబారిన పడుతున్నారు. వాహన చోదకులు గ్రామాలలో రోడ్లపైనే కాకుండా రాష్ట్రీయ రహదార్లపై కూడా జర జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. రోడ్లపై ఉన్న వీధి కుక్కలు వాహనాలను సైతం నిలుపుదల చేస్తున్నాయి. వాహనాలు వేగంగా దగ్గరకు వచ్చిన కుక్కలు మాత్రం రోడ్లపైనే ఉంటున్నాయి. వీధి కుక్కలను నామ్ రోడ్డు, గ్రామ పంచాయతీ అధికారులు నియంత్రించకుంటే ముందు ముందు పెను ప్రమాదాలు జరుగుతుఆయని ప్రజలు అంటున్నారు. వేగంగా వచ్చే వాహనాలకు కుక్కలు అడ్డంగా వస్తున్నాయని, దీంతో వాహనాలు నియంత్రించలేక బోల్తా పడుతున్నాయని చెప్తున్నారు. ఎస్ఎల్ గుడిపాడు, రామంజనేయపురం, వైదన, కొప్పెరపాడు గ్రామాల పరిధిలోని పంట పోలాల నుంచి కుక్కలు రోడ్ల మీదకు వస్తున్నాయని వాహనాల వెంబడి పడడంతో కొందరు రోడ్లపై పడిపోతుతూ గాయపడుతున్నారు. అధికారులు వెంటనే కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టి, ప్రమాదాలు జరగకుండా చూడాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

27న మున్సిపల్ సమావేశం

అద్దంకి, డిసెంబరు27 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పురపాలక సంఘం సాధారణ సమావేశం ఈనెల 27వ తేదీ ఉదయం 11 గంటలకు కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ ఎస్తేరమ్మ అధ్యక్షతన జరుగుతుందని కమిషనర్ రవీంద్ర తెలిపారు.



సోపిరాల గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమంలో పాల్గొన్న అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

సమస్యలు తెలుసుకునేందుకే పల్లెనిద్ర

చినగంజాం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లోని ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అడిషనల్ ఎస్పీ టి.పాండురంగ విఠలేశ్వర్‌రావు తెలిపారు. చినగంజాం పోలీసుస్టేషన్ పరిధిలోని సోపిరాల గ్రామంలో శుక్రవారం రాత్రి ఆయన పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించి, గ్రామస్థులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీసుశాఖను ప్రజలకు చేరువ చేసేందుకు ఎస్పీ పల్లె నిద్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. వ్యక్తిగతంగా ఉన్న సమస్యలను మా దృష్టికి తెస్తే వాటిని పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవకాశమున్న వారు ఇళ్ల వద్ద, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇంకొల్లు సీఐ వై.వి.రమణయ్య, ఎస్ఐ శీ లం రమేష్, గ్రామస్థులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కొండయ్యను సన్మానిస్తున్న కమిషనర్ అబ్దుల్ రషీద్, ఇతర అధికారులు, సిబ్బంది

క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయం

ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు శాంతి సందేశం అనుసరణీయమని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. అంబేడ్కర్ భవన్‌లో శనివారం మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలకు ఎమ్మెల్యే కొండయ్య ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు చూపిన ప్రేమ, జాలి, దయ గుణాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలన్నారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్యాండిల్ సర్వీస్ నిర్వహించారు. ఎమ్మెల్యే కొండయ్యను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, టీపీపీ శ్రీనివాసరావు, మాల్యాద్రి, పలువురు కౌన్సిలర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేటపాలెం వెలుగు కార్యాలయంలో

వేటపాలెం వెలుగు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పార్వతి, ఏపీఎం అంజిబాబు, పొదుపు సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు

కారు ఢీకొని మాజీ సర్పంచ్‌కు గాయాలు

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి నార్కెట్‌పల్లి రహదారి ఎస్ఎల్ గుడిపాడు సమీపంలో శనివారం బైకుపై రోడ్డు దాటుతున్న గ్రామ మాజీ సర్పంచ్ రావులపల్లి గోవింద్‌ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. గోవింద్ గ్రామానికి పరమడ వైపున ఉన్న గొర్రెలదొడ్డి వద్దకు వెళ్లి తిరిగి బైకుపై వస్తుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న కారు బైకును ఢీకొట్టింది. సుమారు 10 అడుగుల ఎత్తు పైకి ఎగిరి గోవింద్ కింద పడిపోయారు. స్థానికులు అతడిని హైవే అంబులెన్స్‌లో నర్సారావుపేట ఆసుపత్రికి తరలించారు.

పలుచోట్ల జగన్ పుట్టినరోజు వేడుకలు

అద్దంకి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను శనివారం అద్దంకిలోని శింగరకొండ రోడ్డులో ఉన్న పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి పాణెం హనిమిరెడ్డి నియోజకవర్గంలోని పలువురు నేతలతో కలిసి కేక్ కట్ చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పర్చూరు, చినగంజాంలో నాయకులు కార్యక్రమాలు నిర్వహించారు.

కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



సైడు కాలువల నిర్మాణానికి పనులు చేయిస్తున్న టీడీపీ నేతలు

బల్లికురవ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో కాలువ పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి హామీ పథకంలో మంజూరైన నిధులతో శనివారం చినఅంబడిపూడి గ్రామంలో సైడు కాలువల నిర్మాణ పనులు మొదలయ్యాయి. ఎంతో కాలగా సైడు కాలువలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.10 లక్షల నిధులతో ప్రధాన వీధిలో రెండువైపులా కాలువ పనులు ప్రారంభయ్యాయి. నిర్మాణ పనులను టీడీపీ నేతలు మొదలు పెట్టారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ జాష్టి స్వప్న బ్రహ్మ, బొల్లినేని హనుమంతురావు, కిలారి శ్రీనివసరావు, గంగవరపు రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నిఘంటువులు అందజేత



దాతలు ఇచ్చిన నిఘంటువులతో విద్యార్థినీవిద్యార్థులు

ఇంకొల్లు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరం వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలలో 130 మంది విద్యార్థులకు ఆంగ్ల, తెలుగు నిఘంటువులను గుంటూరు జిల్లా అంకిరెడ్డిపాలెంకు చెందిన శ్యామల సుబ్బారెడ్డి, నాగరత్నమ్మ జ్ఞాపకార్థం కుమారుడు రఘురామిరెడ్డి, విజయమ్మ అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని నార్నె సమత, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కరి కమలేశ్వరరావు, సంజీవరెడ్డి, వీరగంగాధరరెడ్డి,అంకిరెడ్డి,వీరాస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.